# ప్రజాశక్తి

ఆదివారం 29 జూన్ 2025 | 8 పేజీలు




ఎన్‌టిఆర్



కృష్ణా

# ఈ ఏడాదీ కష్టాల సాగేనా?

- అరకొరగా సబ్సిడీ విత్తనాలు
- వేధిస్తున్న ఎరువుల కొరత
- ఇంకా అందని పెట్టుబడి సాయం



**ప్రజాశక్తి - గన్నవరం :** ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ కష్టంగా సాగేలా కన్పిస్తోంది. సీజన్ ప్రారంభంలోనే రైతులు అడుగడుగునా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గన్నవరం నియోజకవర్గ పరిధిలో ఖరీఫ్ సీజన్లో దాదాపు 47 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. సీజన్ ప్రారంభంలో రైతులకు ప్రభుత్వ పరంగా సహకారం అవసరం ఉంటుంది. కానీ రైతులకు సబ్సిడీ విత్తనాల దగ్గర నుండి పెట్టుబడి సాయం వరకు ప్రభుత్వం నుండి సరైన సహకారం లభించడంలేదని విమర్శలు వస్తున్నాయి.

**అరకొరగా సబ్సిడీ విత్తనాలు**

ఖరీఫ్‌లో దాదాపు 67 వేల ఎకరాల్లో పంటలు సాగవుతుండగా, 47 వేల ఎకరాల్లో వరి సాగుకు రైతులు ఉపక్రమించారు. అయితే ప్రభుత్వం నుండి రైతులకు సబ్సిడీ విత్తనాలు నామమాత్రంగానే అందాయి. రైతులు ఎంటియు 1061, 1318 రకం విత్తనాలు వేస్తారు. అయితే ప్రభుత్వం గన్నవరం మండల పరిధిలో 1061 రకం 100 క్వింటాళ్లు, 1318 రకం 200 క్వింటాళ్లు మాత్రమే సబ్సిడీ విత్తనాలు ఇచ్చింది. అంటే కేవలం మూడు ఎకరాలకు మాత్రమే సబ్సిడీ వరి విత్తనాలను పంపిణీ చేసింది. మిగితా 10 వేల ఎకరాలకు సబ్సిడీ విత్తనాలు ఇవ్వలేదు. దీంతో రైతులు అధిక ధరలకు విత్తనాలు ఎరువుల దుకాణాల్లో, సహచర రైతుల వద్ద కొనుగోలు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన విత్తనాలకు 30 కిలోల బస్తా రూ.1110 ధర ఉంది. బహిరంగ మార్కెట్లో ధర రూ.1300 నుంచి రూ.1500 వరకు ఉంది. అయితే విత్తనాలకు డిమాండ్ పెరగడంతో రైతులు అధిక ధరలకు వాటిని కొనుగోలు చేస్తున్నారు.

**ఎరువుల కొరత**

ఖరీఫ్ సాగులో భాగంగా రైతులు నారుమళ్లు వేస్తున్నారు. అయితే ప్రస్తుతం ఎరువులు అందుబాటులో లేకపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులకు కావాల్సిన డిఏపి ఎరువులు రైతులకు ఎక్కడా దొరకటం లేదు. ఇక యూరియా నిల్వ కూడా అంతంత మాత్రంగానే ఉంది. ప్రభుత్వం ప్రకటించిన (మిగతా 2లో)

### ఎరువులు అందుబాటులో ఉంచాలి : జి.వీర్రాజు, తెంపల్లి, రైతు



రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి. డిఏపి, యూరియాను ప్రభుత్వ ధరల ప్రకారమే విక్రయించాలి. ఎరువులు లేకపోతే సాగు సక్రమంగా జరగదు. రైతులు బాగుంటేనే దేశం బాగుంటుంది.

### ప్రభుత్వం ఆదుకోవాలి ఏసుదాసు, కార్యదర్శి, కౌలు రైతు సంఘం



రైతులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలి. ప్రధానంగా పంట రుణాలను వడ్డీ లేకుండా ఇవ్వాలి. ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి. కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు అమలు చేయాలి.



సురక్ష 360 డిగ్రీలు కార్యక్రమంలో మంత్రి అనిత, ఎంపి శివనాథ్, కలెక్టర్ లక్ష్మీశ, సిపి రాజశేఖరబాబు

# స్మార్ట్ పోలీసింగ్‌తో నేరాలకు అడ్డుకట్ట

- హోంమంత్రి అనిత
- సురక్షా 360కు ప్రారంభోత్సవం

**ప్రజాశక్తి - విజయవాడ :** స్మార్ట్ పోలీసింగ్, ఇన్విజిబుల్ పోలీసింగ్ వ్యవస్థ ద్వారా నేరాలకు అడ్డుకట్ట వేస్తున్నామని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. మాచవరం పోలీసు స్టేషన్ పరిధిలో సుజన ది వెన్యూ ఫంక్షన్ హాల్‌లో పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆధ్వర్యాన ఎన్‌టిఆర్ పోలీస్ కమిషనర్ రేట్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజల భద్రత నిమిత్తం నిరంతర పర్యవేక్షణ కోసం 321 గ్రామాలు, 20 మండలాలు, 4 మున్సిపాలిటీలు, ఒక నగరపాలక సంస్థ, 64 వార్డులు... మొత్తం 1211 చదరపు కిలోమీటర్ల మేర నగరాల నుండి గ్రామాల వరకు 100 శాతం సిసి కెమెరాల ద్వారా కవరయ్యే విధంగా ఏర్పాటు చేసిన సురక్షా 360 కార్యక్రమాన్ని మంత్రి అనిత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అనిత మాట్లాడుతూ సీసీ కెమెరాల ద్వారా రాష్ట్రంలో నేరాల సంఖ్య తగ్గిందన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా కమిషనరేట్ టెక్నాలజీ వినియోగంలో ముందంజలో ఉందన్నారు. అస్త్రం యాప్ ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు లేకుండా చేస్తున్నారన్నారు. మహిళల రక్షణకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. శక్తి యాప్ ద్వారా మహిళలకు భద్రత, భరోసా ఇస్తున్నామన్నారు. విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ జిల్లాలో ఆలయాల పరిరక్షణకు డివైన్ సురక్షతో పాటు, సురక్ష 360ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ సురక్ష 360 డిగ్రీ కార్యక్రమం చేపట్టిన పోలీసు వ్యవస్థను అభినందించారు. నగర పోలీస్ కమిషనర్ ఎస్‌వి.రాజశేఖరబాబు మాట్లాడుతూ రౌడీషీటర్లు, కేడీలు, సస్పెక్ట్స్, గంజాయి సేవించే వారు యన్టీఆర్ జిల్లాలో 3400 మంది ఉన్నారని, వారికి సంబంధించిన అన్ని ఆధారాలు, వేలిముద్రలు సేకరించామని చెప్పారు. ఇకపై వారు ఎటువంటి నేరం చేసినా వెంటనే పట్టుబడే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం జిల్లాలో సిసి కెమెరాల ఏర్పాటుకు సహకరించిన దాతలను దుశ్శాలువతో సత్కరించారు. ఈకార్యక్రమంలో ఎంఎల్ఎలు యలమంచిలి సుజనా చౌదరి, బొండా ఉమా మహేశ్వర రావు, గద్దె రామ్మోహన రావు, శ్రీరామ్ రాజగోపాల్, కొలికపూడి శ్రీనివాసరావు, డిసిపి కె.జి.వి.సరిత పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు
- 'సిఎం గారు మా అమ్మానాన్నలకు జీతాలు పెంచండి' ప్లెక్సీలతో చిన్నారుల నినాదాలు

**ప్రజాశక్తి - విజయవాడ :** కూటమి ప్రభుత్వం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల నిరవధిక సమ్మె శనివారానికి నాలుగో రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా కార్మికులతోపాటు కుటుంబ సభ్యులు, పిల్లలతో సహా విజయవాడ ధర్నా చౌక్‌లో ఆందోళన నిర్వహించారు. సమ్మెతో నగరంలో మంచినీటి సరఫరా, పార్కులు, వీధిలైట్లు, ప్రణాళిక విభాగం సంబంధిత కార్యకలాపాలు స్తంభించాయి. "చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ మా గోడు వినండి" అని ప్ల కార్డులు చేతబట్టి పెద్దపెట్టున నినాదాలు చేశారు. కార్మికుల సమ్మెకు బూబురావు మద్దతు తెలిపి ధర్నా శిబిరంలో మాట్లాడారు. రాష్ట్రంలోనూ, అమరావతిలోనూ ఎల్అండ్‌టి, షాపూర్జి తదితర బడా కార్పొరేట్ కంపెనీలకు అంచనాలను సవరించి అభివృద్ధి పనుల టెండర్లు కట్టబెట్టారని, పనులు ప్రారంభించకముందు ఆ (మిగతా 2లో)



మున్సిపల్ కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సిహెచ్.బాబురావు



సమావేశంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి

# దెబ్బతిన్న రోడ్డు నిర్మాణానికి రూ.45.21 లక్షలు

### స్థాయీ సంఘం ఆమోదం

**ప్రజాశక్తి-విజయవాడ :** గుణదల ప్రాంత నున్న రోడ్డు నుంచి ఎస్ఎల్‌వి అమరావతి గ్రాండ్‌ను కలుపుతూ దెబ్బతిన్న రోడ్డును జిఎస్‌బి, డబ్ల్యుఎంఎంతో రోడ్డు వేయడానికి అయ్యే రూ. 45.21 లక్షల అంచనా ఖర్చును జనరల్ నిధుల నుంచి కేటాయిస్తూ స్టాండింగ్ కమిటీ తీర్మానించింది. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం శనివారం జరిగింది. స్టాండింగ్ కమిటీ అజెండాలో కేవలం ఎనిమిది అంశాలయినప్పటికీ...చర్చ కూడా నామ్‌కే వాస్తే అన్నట్లు సమావేశాన్ని ముగించినట్లు తెలిసింది. ఉద్యానవనశాఖ సర్కిల్-1, సర్కిల్-2, సర్కిల్-3 పరిధిలో గ్రీన్ బెల్ట్, సెంట్రల్ డివైడర్లు, పార్కులు, గ్రీనరీ నిర్వహణ కోసం కాంట్రాక్ట్ పద్ధతిపై ముగ్గురు హార్టికల్చర్ ఆఫీసర్లను భర్తీ చేస్తూ సమావేశం నిర్ణయం చేసింది. వీరికి ఒక్కొక్కరికి నెలకు రూ. 34,155 చొప్పున ఈ (మిగతా 2లో)

## కృష్ణయ్య మృతికి తీరనిలోటు

### అంతిమయాత్రలో సిపిఎం నాయకులు సిహెచ్.బాబురావు

**విజయవాడ :** సిపిఎం సీనియర్ సభ్యులు వై.కృష్ణయ్య మృతి పార్టీ ఉద్యమానికి తీరనిలోటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు అన్నారు. అనారోగ్యంతో మరణించిన యెర్రుబోయిన కృష్ణయ్య అంతిమయాత్ర శనివారం జరిగింది. అంతిమ యాత్రలో మధురానగర్లోని ఆయన ఇంటి వద్ద నుండి మునిస్వామి రీడింగ్ రూమ్ మీదగా బిఆర్‌టిఎస్ రోడ్డు వరకు కృష్ణయ్య భౌతికకాయాన్ని కార్యకర్తల భుజాలపై మోసుకొని వచ్చారు. అక్కడి నుండి కృష్ణలంకలోని స్వర్గపురి వరకు ర్యాలీగా సాగింది. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో కృష్ణయ్య తుదకంటూ పోరాడారని అన్నారు. యువజన సంఘంతో ఆయన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందన్నారు. సిపిఎం మధురానగర్ డివిజన్ కార్యదర్శిగా పనిచేశారని గుర్తుచేశారు. మధురానగర్ ప్రాంత ప్రజల సమస్యలపై ఉద్యమించారని తెలిపారు. మధురానగర్లోని నార్లవారి వీధికి దారిని మూసేస్తే ప్రజలు ఇబ్బంది పడతారని, ఆదారిని యధాతథంగా ఉంచాలని 40 రోజులపాటు రిలే నిరాహార దీక్షలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడంలో కృష్ణయ్య ప్రధాన పాత్ర పోషించారని కొనియాడారు. కాల్వగట్లపై ఉన్న ఇళ్లకు పట్టాలు ఇవ్వాలని చేసిన ఉద్యమానికి నేతృత్వం వహించారన్నారు. మధురానగర్ ప్రజల చిరకాల వాంఛ అయిన కర్మలభవనం సాధించడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యమ గ్రామం చిరివాడ నుండి వచ్చిన ప్రతి ఒక్కరికీ ఎర్రజెండా అంటే ఓ మమకారం ఉందని, ఆ ఎర్రజెండా వారసత్వాన్ని కృష్ణయ్య తుదకంటూ మోసుకొచ్చారని అన్నారు. కృష్ణయ్య ఆశయాలను ముందుకు తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.సిహెచ్.శ్రీనివాస్, సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణరావు, ఎ.వెంకటేశ్వరరావు, కృష్ణమూర్తి, చిన్న, మురళీ పాల్గొన్నారు.

## ఆర్‌పిలకు ట్యాబ్‌లు పంపిణీ

**ప్రజాశక్తి-విజయవాడ :** విజయవాడ తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాలకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, సమాఖ్య రిసోర్స్ పర్సన్స్‌కు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం శనివారం నగరంలోని ఐ.వి ఫ్యాలెస్‌లో జరిగింది. మెప్మా ఆధ్వర్యంలో జరిగిన ట్యాబ్ ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ కేశినేని శివనాథ్,ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు హాజరయ్యి, 500 మంది ఆర్.పిలకు 35 వేల రూపాయలు విలువ చేసే ట్యాబ్‌లను యంపి, ఎమ్మెల్యే పంపిణీ చేశారు. . ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వానికి, డ్వాక్రా సంఘాలకు ఆర్.పిలు వారధి లాంటి వారని అన్నారు. డిజిటలైజేషన్‌లో భాగంగా ఆర్.పి లకు ట్యాబ్ లు అందించటం జరిగిందన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ..సింగ్ నగర్ లో డ్వాక్రా బజార్ ఏర్పాటు కోసం స్థల పరిశీలన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా పి.వో వెంకట నారాయణ, జిల్లా అర్బన్ మహిళ సమాఖ్య ప్రెసిడెంట్ కె.మీనాక్షి, కోశాధికారి కె.త్రివేణి , ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్స్ అండ్ అదర్ కన్స్ ట్రక్షన్స్ వర్కర్స్ అడ్వైజర్ కమిటీ ఛైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, టిడిపి ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి,49వ డివిజన్ కార్పొరేటర్ బుల్లా విజయ్, మెప్మా టి.ఈలు, సి.డి.వోలు, ఎస్.డబ్ల్యూ, సి.వో లు , సి.ఎల్.ఆర్.ఎపిలు, ఆర్.పి లు, టి.ఎల్.ఎఫ్.ఓ.బి లు పాల్గొన్నారు.



## విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

**విజయవాడ :** ప్రభుత్వం విద్యా రంగానికి కేటాయిస్తున్న నిధులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంకె బేగ్ మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ విద్యా కమిటీ అధ్యక్షులు టి.సంధ్యారాణి అన్నారు. శనివారం ఎంకె బేగ్ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ఎస్.ఇమాన్ బాషా, విద్యా కమిటీ ఉపాధ్యక్షులు జి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.




## మొదటిపేజీ తరువాయి

### ఈ ఏడాదీ కష్టాల సాగేనా?

యూరియా ధర హోల్‌సేల్ ధరలకు విక్రయిస్తే తమకు ఏమీ మిగలదని ఎరువుల దుకాణాల యజమానులు చెబుతున్నారు. రవాణా, లోడింగ్ ధరల భారం పడుతున్నందున ఖర్చులు లేకుండా యూరియా సరఫరా చేయాలని ఎరువుల వ్యాపారుల డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో యూరియా వ్యవహారం వివాదంగా ఉంది. దీంతో ఎరువులు చాలినంతగా నిల్వ చేయడంలో వెనకడుగు వేయటంతో దీని ప్రభావం రైతులపై పడుతోంది. దుక్కిదున్ని నాట్లు వేసిన సమయంలో ఎరువులు ఎలా అందుతాయని రైతులు ప్రశ్నిస్తున్నారు.

**పెట్టుబడి సాయం లేదు**

రైతులకు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించకపోవటంతో రైతులు ఆసంతప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 20వ తేదీ నాటికి అన్నదాత సుఖీభవ ఇస్తామని హడావుడి చేసిన అధికారులు ఇప్పటివరకు ఆర్థిక సాయం అందించలేదు. కౌలు రైతులకు గుర్తింపుకార్డులు కూడా పూర్తిగా ఇవ్వలేదు. అంతేగాక కౌలు రైతులకు బ్యాంకు రుణాల ఇచ్చే విషయంలో ప్రభుత్వం నేటికి ప్రత్యేక చర్యలు తీసుకోలేదు. దీంతో రైతులు, కౌలు రైతులు ఖరీఫ్ సాగుకు పెట్టుబడి పెట్టేందుకు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

### మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కంపెనీలకు 10 నుండి 15 శాతం నిధులను కూటమి ప్రభుత్వం అడ్వాన్స్‌గా చెల్లిస్తోందని విమర్శించారు. ఈకార్యక్రమంలో ఎపి మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నగర నగర అధ్యక్షులు ఎస్ జ్యోతిబాస్, సిఐటియు నాయకులు టి.ప్రవీణ్, కె.దుర్గారావు, నాయకులు స్టీఫెన్ బాబు, టి.తిరుపతమ్మ, సాంబులు, దుర్గాప్రసాద్, కృష్ణవేణి, చిన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### దెబ్బతిన్న రోడ్డు నిర్మాణానికి రూ.45.21 లక్షలు

ఏడాది జులై నుంచి వచ్చే ఏడాది జూన్ 30 వరకు ముగ్గురు ఆఫీసర్లకు రూ. 12.29 లక్షలుసాధారణ నిధుల నుంచి బడ్జెట్‌ను కేటాయిస్తూ సమావేశం నిర్ణయం చేసింది. 60వ డివిజన్ శ్రీరామ్ ఎనర్జీ రోడ్డు (వాటర్ ట్యాంక్ రోడ్డు) వాంబేకాలనీ రోడ్డు జి-బ్లాక్ జంక్షన్ నుంచి డిస్నీల్యాండ్ రోడ్డు వరకు రోడ్డుసైడ్ మార్జిన్‌లు పేవర్ బ్లాక్స్‌తో అభివృద్ధి పరచి, డివిజన్ ప్రజలకు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడానికి రూ. 39. 95 లక్షల అంచనా వ్యయాన్ని సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయడానికి సమావేశం ఆమోదం తెలిపింది. పార్కు సెక్షన్ ఇంజినీరింగ్ విభాగంలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ. ఐదు లక్షల లోపు నామినేషన్ పద్ధతిలో ఆమోదం పొందిన 50 అత్యవసర పనులను, అలాగే గత ఏడాది డిశంబర్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు రూ. ఐదు లక్షల లోపు నామినేషన్ పద్ధతిలో ఆమోదం పొందిన 114 అత్యవసర పనులకు సంబంధించి ర్యాటిఫై చేస్తూ సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు... బాపతి కోటిరెడ్డి, మహమ్మద్ ఇర్ఫాన్, వల్లూరి ఎన్‌డిఎస్ సత్యనారాయణమూర్తి, అంబడిపూడి నిర్మల కుమారి, ఇసరపు దేవి, చీఫ్ ఇంజినీర్ ఆర్ శ్రీనాద్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి : కలెక్టర్




మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

**ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ :** జిల్లాలోని విద్యార్థుల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దే గురుతర బాధ్యతను సక్రమంగా నెరవేర్చాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. శనివారం ఉదయం కష్ణా విశ్వవిద్యాలయంలో అకాడమీ బ్లాక్ లోని అల్లూరి సీతారామరాజు ఆడిటోరియంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు వ్యక్తిత్వ వికాసము, ప్రేరణ తరగతులను జిల్లా కలెక్టర్ నేతత్వంలో వినూత్నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఒక దేశం అభివద్ధి చెందాలంటే ఆ దేశంలో ఉన్న వనరులు గాని భూమి కానీ ఖనిజాలు గాని ఉంటే సరిపోదని సరైన ప్రజలు ఉండాలన్నారు.ఆ ప్రజలను మంచివారిగా తీర్చిదిద్దాలంటే ఒక ఉపాధ్యాయునికే సాధ్యమవుతుందన్నారు. విద్యార్థుల జీవితాలను వారి తలరాతలను మార్చగలిగే శక్తి సామర్థ్యం ఒక్క టీచర్కే ఉంటుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లో ఉందన్నారు.ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు గాని ఉపాధ్యాయురాలు గాని తనకు అప్పగించిన సబ్జెక్టును ఎంతవరకు ప్రేమిస్తున్నారో ఆ సబ్జెక్టు కోసం ఎంత సమయం కేటాయిస్తున్నారో, పాఠాలు చెప్పేందుకు అవసరమైన నోట్స్ తయారు చేసుకున్నారా లేదా, ఆంగ్ల ఉపాధ్యాయులు విధిగా ఆంగ్ల వార్తాపత్రికలు చదువుతున్నారా లేదా అనే విషయం పైన ఒకసారి ఆలోచించాలన్నారు. జిల్లా విద్యాధికారి పి వి జె రామారావు మాట్లాడుతూ ఇటీవల పదవ తరగతి పరీక్షల్లో జిల్లా 82.32 శాతం ఫలితాలను సాధించిందని, 161 మంది విద్యార్థులు షైనింగ్ స్టార్స్ గా నిలిచారన్నారు. ఈసారి ప్రభుత్వ పాఠశాలల్లో నాలుగు అంకెల లో విద్యార్థులు ప్రతిభ కనబరిచేలా ఫలితాలు రావాలని, రాష్ట్రంలోనే మొదటి స్థానం సాధించాలని, ఇందుకోసం ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేకించి శిక్షణ తరగతులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఒకటి నుండి 5వ తరగతిలో కనీసం 60 మంది విద్యార్థులు ఉంటే ఒక ప్రధానోపాధ్యాయులు, ఐదుగురు ఉపాధ్యాయులను నియమిస్తున్నామన్నారు. ఈ ప్రేరణ తరగతుల్లో విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కే రాంజీ, రిజిస్ట్రార్ ఆచార్య ఉష, ఉపవిద్యాధికారులు, జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



చిట్టిబాబు (ఫైల్)

**ప్రజాశక్తి-ఘంటసాల :** ఘంటసాల మండలంలోని కొడాలి గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దొండపాటి చిట్టిబాబు (20) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదం పామర్రు- అవనిగడ్డ ప్రధాన రహదారిలో కొడాలి యూనియన్ బ్యాంక్ సమీపంలో చోటు చేసుకుంది. చిట్టిబాబు తన గహమైన దళితవాడ వైపు, పల్సర్ బైక్‌పై వెళుతుండగా మీసేవ సెంటర్ వద్ద సైకిల్ పై వెళుతున్న వ్యక్తిని తప్పించబోయే ప్రయత్నంలో బైక్ స్కిడ్ అయింది. ఈ ఘటనలో తలకు తీవ్రగాయాల వల్ల చిట్టిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన గుమ్మడి సత్యం సైకిల్ పై తన ఇంటికి వెళుతుండగా బైక్ ఢీకొనడంతో అతని కాలికి బలమైన గాయమయ్యింది. వెంటనే 108 అంబులెన్స్ లో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఘంటసాల ఎస్ఐ కేసును నమోదు చేసి ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు.

# బందరు అభివృద్ధికి చర్యలు : మంత్రి



మురుగునీటి కాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) :** బందరుని అభివృద్ధి పథంలో నడిపించడమే తన తక్షణ కర్తవ్యమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శనివారం మచిలీపట్నం మున్సిపల్ ఆఫీస్ పక్కన 17 వ డివిజన లో 35.16 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న మురుగునీటి కాలువ నిర్మాణ పనులకు మంత్రి శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయానికి ఆనుకుని, సుమారు 10 డివిజన్లకు ఆనుకుని ఉన్న డ్రైన్ ఆక్రమణలకు గురవ్వడంతో ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారని ,గత ఐదేళ్ల పాలకులు పట్టించుకోకపోవడం, రాజాగారి సెంటర్ వద్ద కక్ష సాధింపు చర్యల్లో భాగంగా పనుల్ని నిర్లక్ష్యం చేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. రోడ్లపై నడవాలంటేనే ప్రజలు నిత్యం నరకం అనుభవించారన్నారు. వారి కష్టాలు చూసి అధికారంలోకి రాగానే పనుల్ని ప్రారంభించాం అన్నారు.ఆక్రమణలను తొలగించి అభివద్ధికి శ్రీకారం చుట్టాం అని రోడ్డుకు రెండు వైపులా డ్రైన్ నిర్మాణంతో పాటుగా, ఆక్రమణలను తొలగించి రోడ్డును విస్తరించామన్నారు. మచిలీపట్నం నగరంలో 165 కోట్ల రూపాయల ఖర్చుతో ఒక కార్యాచరణ ప్రణాళిక ప్రకారం మురుగు నీటి వ్యవస్థను మెరుగుపరిచి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో కషి చేస్తున్నామన్నారు. ఈ రహదారి 40 అడుగుల తో ఉందని రెండు వైపులా మురికినీటి కాలువలను కాంక్రీట్ తో నిర్మించి మంచి రహదారులు ఏర్పాటు చేసి మొక్కల పెంపకంతో ఆదర్శ వీధిగా తీర్చిదిద్దుతామన్నారు. మురుగునీరు సజావుగా ప్రవహించేలా చర్యలు తీసుకుంటామన్నారు.ఆంధ్ర బ్యాంకు వ్యవస్థాపకులు డాక్టర్ పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణానికి భూమి కేటాయించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కోనేరు సెంటర్లో స్వాతంత్ర సమరయోధులు తోట నరసయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, డివిజన్ కార్పొరేటర్ సమతా కీర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందిస్తున్న దృశ్యం

## విజేతలకు బహుమతులు అందజేత

**ప్రజాశక్తి-కోడూరు :** యువత నైపుణ్యం పెంచుకొని జాతీయ స్థాయికి ఎదగాలని నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ ఆకాంక్ష వ్యక్తం చేశారు. శనివారం కోడూరు మండల పరిధిలోని పాలకాయతిప్ప సముద్ర తీరాన అటవీ శాఖ సహకారంతో గత 20 రోజుల నుండి పాలకాయతిప్ప ప్రీమియర్ లీగ్ మండల స్థాయి క్రికెట్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. శనివారం హంసలదీవి-పాలకాయతిప్ప జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఫైనల్లో హంసలదీవి టీమ్ విజేతగా నిలిచింది. రెండో బహుమతి రూ.పది వేలు, మూడో బహుమతి రూ.ఏడు వేలు అందచేశారు. విజేత జట్టుకు ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు మొదటి బహుమతి రూ.15వేలు, రన్నర్ పాలకాయతిప్ప జట్టుకు సిహెచ్ బాలయ్య రూ.పది వేలు, మూడో స్థానం పొందిన జట్టుకు సిహెచ్ ఆంజనేయులు రూ.ఏడు వేలు అందించారు. విజేతలకు మండలి వెంకట్రామ్, చిలకలపూడి పాపారావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ తీర ప్రాంత గ్రామాల నుండి క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్ తోట కనకదుర్గ, జనసేన పార్టీ నాయకులు, కీడాకారులు పాల్గొన్నారు.

## విక్కుర్తికి యోగాంధ్ర సర్టిఫికెట్ ప్రదానం

**ప్రజాశక్తి-అవనిగడ్డ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన యోగాంధ్ర 2025 లో భాగస్వామ్యమైన ప్రముఖ పారిశ్రామికవేత్త, కూటమి నాయకులు విక్కుర్తి వెంకట శ్రీనివాసరావుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ మేరకు విక్కుర్తి శనివారం విలేకరులతో మాట్లాడుతూ యోగా ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడానికి రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములు అయినందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి తనకు కృతజ్ఞతలు తెలుపుతూ సర్టిఫికెట్లు అందజేశారు అన్నారు. తనకు ముఖ్యమంత్రి సర్టిఫికెట్ను పంపించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని యోగా చేయడానికి కేటాయిస్తేనే ప్రభుత్వ ఉద్దేశం నెరవేరుతుందని శ్రీనివాస్ తెలిపారు.

## బందరు మున్సిపల్ కమిషనర్‌పై ఆరోపణల్లో వాస్తవం లేదు : టిడిపి




మాట్లాడుతున్న టిడిపి నాయకులు

**ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) :** మచిలీపట్నం మున్సిపల్ కమిషనర్‌పై వైసీపీ కార్పొరేటర్ల నిందారోపణలు అవాస్తవం అని పలువురు టిడిపి నాయకులు తెలిపారు. నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, టీడీపీ నగర అధ్యక్షులు లోగిశెట్టి వెంకటస్వామి, కార్పొరేటర్ దింటకుర్తి సుధాకర్, టీడీపీ నేత రామగాని రత్నాకర్ లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో కమిషనర్ మచిలీపట్నం రాలేదని, వైసిపి ప్రభుత్వం ఉన్నప్పుడే కమిషనర్ ను తెచ్చుకున్నారన్నారు. నాడు మీరు చెప్పిన ప్రతి ఒక్క పని చేసినందుకు నాడు మీరే ఆయన్ని మెచ్చుకుని సన్మానాలు చేసిన విషయం గుర్తు లేదా ప్రశ్నించారు. ఇప్పుడేమో నిధులు దుర్వినియోగం చేస్తున్నాడని నిందారోపణలు చేయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. రూ.32 కోట్లు మున్సిపల్ నిధులను కమిషనర్ దుర్వినియోగం చేశారని వైసీపీ కార్పొరేటర్లు కలెక్టర్ కు ఫిర్యాదు చేయడం గర్హనీయం అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగర అభివద్ధికి కౌన్సిల్ లో పాలకవర్గంగా ఉన్న వైసీపీ ఏ మాత్రం సహకరించడం లేదన్నారు. కౌన్సిల్ సహకారం లేకపోయినా ప్రజలకు అసౌకర్యం కలగకుండా అత్యవసర పనులన్నింటినీ చేపడుతున్నామన్నారు. వైసీపీ ఆరోపిస్తున్న ఆ 32 కోట్ల నిధులతో ఐదేళ్లుగా క్లీనింగ్ కు నోచుకోని ఫిల్టర్ బెడ్స్ ను క్లీన్ చేయించి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేస్తున్నాం అన్నారు.అలాగే డ్రైన్లలో సిల్టు తొలగించి ముంపు సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు. ఖర్చు చేసిన ప్రతి రూపాయికి మున్సిపల్ కార్పొరేషన్ లో లెక్కలు ఉన్నాయని స్పష్టం చేశారు.

## తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి

**ప్రజాశక్తి-గన్నవరం :** గన్నవరం మండలంలో చాలా గ్రామాలలోని చెరువులలో పగలు, రాత్రుళ్లు ట్రాక్టర్లు,లారీలతో చట్టా విరుద్ధంగా మట్టి తోలుతున్నారని ప్రకటన చేసిన తనపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానంటూ బెదిరింపులకు దిగిన తహసిల్దార్ వెంకట శివయ్య పై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్కు శనివారం ఫిర్యాదు ఇచ్చినట్లు జడ్పిటిసి ఏఈ రాణి తెలిపారు. ఆమె మాట్లాడుతూ తహసిల్దార్ ఉద్యోగిగా కాకుండా ఒక రాజకీయ పార్టీకి చెందిన వారిలా ప్రకటనలు చేస్తున్నారని, తనను అవమానపరుస్తూ తెలుగు దేశం పార్టీకి చెందిన నాయకుడు ఆళ్ళ గోపాలకష్ణ తో కూడా తహసీల్దార్ పేరుతో రాసిన ప్రెస్ నోట్ 24 వ తేదిన మీడియా గ్రూపులో పెట్టించారని తెలిపారు. దాని అర్థం రాజకీయ కుట్రా కాదా అన్నారు. అందువలన తహసీల్దార్ కు రాజకీయాలు ముఖ్యం అనుకుంటే ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయ పార్టీలో చేరి విమర్శలు చేయాలన్నారు.

## రత్నాకర్ మృతికి సంతాపం

**ప్రజాశక్తి - గుడివాడ :** శుక్రవారం పామర్రు మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన గుడివాడ ఐటిఐ కళాశాల జూనియర్ అసిస్టెంట్ కొసనం రత్నాకర్ అకాల మృతికి ఎన్జీవో అసోసియేషన్ నేతలు శనివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఎన్జీవో అసోసియేషన్ గుడివాడ శాఖ అధ్యక్షులు కెపి రావు, ప్రధాన కార్యదర్శి గోగులమూడి రాజేంద్ర ప్రసాద్, సంయుక్త కార్యదర్శి కంచర్ల మహేష్, ఉపాధ్యక్షురాలు జి.నిర్మలాఫ్లోరెన్స్‌లు అసోసియేషన్ సభ్యులు రత్నకర్ మృతికి సంతాపం తెలిపారు.

## వాటర్ ప్లాంట్ ప్రారంభం

**ప్రజాశక్తి-ఘంటసాల :** సురక్షితమైన తాగునీరు ప్రజలకు అందించడం అభినందనీయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. స్వచ్ఛమైన తాగునీరు ప్రతి ఒక్కరి హక్కు ఈ హక్కును నెరవేర్చేలా నూతనంగా ప్రారంభమైన నాంది వాటర్ ప్లాంట్ గ్రామస్తుల ఆరోగ్య రక్షణకు దోహదపడనుందని రామకృష్ణ స్పష్టం చేశారు. శనివారం ఘంటసాల మండలంలోని చిన్నకల్లేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన నాంది వాటర్ ప్లాంట్‌ను రామకృష్ణతో పాటు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు, గ్రామ సర్పంచ్ గుత్తికొండ రామారావు, శ్రీకాకుళం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ అయినపూడి భాను ప్రకాష్, ఎంపీడీవో సుబ్బారావు కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో ఇప్పటికీ తాగునీటి కొరత ఒక ప్రధాన సమస్యగా ఉందన్నారు. ఇటువంటి ప్లాంట్లు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా, గ్రామ అభివృద్ధికి మంచి ఉదాహరణగా నిలుస్తాయన్నారు.



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కె. రామకృష్ణ

# ఉద్యోగ ఎంపికలో భావవ్యక్తీకరణ కీలకం



**ప్రజాశక్తి - విజయవాడ సిటీ :** ప్రాంగణ ఎంపికలతో సహా వివిధ స్థాయి ఉద్యోగాల ఎంపికలో భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు కీలకపాత్ర పోషిస్తాయని ప్రముఖ ఆంగ్లవిద్యావేత్త డాక్టర్ ఎ.సురేశ్ బాబు అన్నారు. కె.బి.ఎన్. కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో శనివారం 'ఇంపార్టెన్స్ ఆఫ్ ఎఫెక్టివ్ ప్రజెంటేషన్ స్కిల్స్ ఫర్ ఇంటర్వ్యూస్' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ ఆశావహ దృక్పథం, సానుకూల ధోరణి ఇంటర్వ్యూలో ఎంపిక కావటానికి అత్యంత అవసరమన్నారు. హిందూ హైస్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, పి.ఎల్.రమేష్ పాల్గొన్నారు. అధ్యాపకులు ఎస్.శాంత, కె.రాధ కార్యక్రమాన్ని నిర్వహించారు.



# ఇంజనీరింగ్ కార్మికుల నిరసన

**ప్రజాశక్తి - నందిగామ :** ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని జూలై 4న విజయవాడలో పెద్ద ఎత్తున ధర్నా చేపట్టడం జరుగుతుందని సిఐటియు జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ పేర్కొన్నారు. శనివారం నందిగామలో ఇంజనీరింగ్ కార్మికులు నిరసన తెలిపారు. ఈ ధర్నాని జయప్రదం చేయాలని సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడుతూ విజయవాడ కార్పొరేషన్ లో ఇంజనీరింగ్ కార్మికులు 25 నుండి సమ్మె చేస్తూ ఉన్నారని తెలిపారు. అనంతరం ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే కార్మికుల జనరల్ బాడీ సమావేశం ఆర్అండ్‌బి బంగ్లా ఆవరణంలో జరిగింది. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పరిమి రవి, కార్యదర్శిగా శ్రావణ్ కుమార్, కోశాధికారిగా కండెల శ్రీను, ఉపాధ్యక్షులుగా కస్తాల దాసు, సహాయ కార్యదర్శి దారేల్లి అశోకు. ఇంజనీరింగ్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యాసామగ్రి అందజేత

**ప్రజాశక్తి - తిరువూరు :** మునకళ్ళ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జెక్కేపల్లి మురళీకృష్ణ తన కుమారుడు రామ్‌చరణ్ పవన్ పుట్టినరోజు సందర్భంగా పాఠశాల విద్యార్థులకు రూ.పదివేలు విలువగల జామెంట్రీ బాక్సులు, కాపీ రైటింగ్ పుస్తకాలు, మ్యాప్ పాయింటింగ్ బుక్స్, నోట్ బుక్స్‌ను వితరణ చేశారు. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నిత్యాన్నదానానికి రూ.5 లక్షలు విరాళం

**ప్రజాశక్తి - విజయవాడ సిటీ :** ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గమ్మ దేవస్థానంలో నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన సంతోష్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత చుక్కపల్లి జగన్మోహన్‌రావు కుమారులు చుక్కపల్లి శ్రీకాంత్, చుక్కపల్లి కష్ణ ప్రసాద్ రూ.5 లక్షలు విరాళంగా ఇచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె.శీనానాయక్‌కు అందజేశారు. అనంతరం దాతలకు అమ్మవారి దర్శనం, ఆశీర్వచనం అందజేశారు.

# 5న జాతీయ లోక్ అదాలత్ : జిల్లా జడ్జి శ్రీనివాసరావు



**ప్రజాశక్తి - నందిగామ :** జూలై 5న నందిగామ 16వ అదనపు న్యాయస్థానం ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని నందిగామ 16వ అదనపు న్యాయస్థానం జిల్లా జడ్జి పి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం నందిగామ జిల్లా జడ్జి కోర్టు ఛాంబర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో జిల్లా జడ్జి పి.శ్రీనివాసరావు మాట్లాడారు. జూలై 5న జాతీయ లోక్ అదాలత్ నిర్వహణకు నందిగామ కోర్టులో అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవా ధికారసంస్థ ఆదేశాల మేరకు జులై 5న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో దీర్ఘ కాలం పెండింగ్‌లో వున్న సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కరించనున్నట్లు తెలిపారు. నందిగామ సబ్ కోర్టు జడ్జి వి.సత్యలక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ జూలై 5న నందిగామలో జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడ దగిన సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద క్లెయిమ్లు, ఎక్సైజ్ కేసులు, పిఎల్‌సిలు, అన్ని రకాల సివిల్ కేసులు రాజీ చేసుకోవచ్చని తెలిపారు. కక్షిదారులు తమ న్యాయవాదులను సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాతీయ లోక్ అదాలత్‌కు ప్రత్యేక బెంచ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు బెంచ్‌లు కూర్చొని కేసులు పరిష్కారం చేస్తారని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో పెద్ద ఎత్తున కక్షిదారులు పాల్గొని కేసులు పరిష్కారం చేసుకోవాలని కోరారు.

# 30న బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ



విజయవాడలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు



మైలవరంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి - విజయవాడ :** విజయవాడ రూరల్ రామవరప్పాడులో ఈ నెల 30న ఎన్.టి.ఆర్ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ 10వ జిల్లా మహాసభలు జరుగుతున్నాయని యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, పిల్లి నరసింహారావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జరిగే ప్రదర్శన, సభలో నిర్మాణ రంగంలోని అన్ని వృత్తుల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. స్థానిక బాలోత్సవ్ భవన్‌లో శనివారం మహాసభ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా 10వ జిల్లా మహాసభల్లో భవన నిర్మాణ రంగంలో జిల్లాలో పనిచేస్తున్న సుమారు 1.50 లక్షల మంది కార్మికుల సమస్యలపై చర్చిస్తామన్నారు. ఈ మహాసభ ప్రారంభం సందర్భంగా రామవరప్పాడు వంతెన సెంటర్ నుండి ప్రసాదంపాడు ఎస్.ఇ.ఆర్ సెంటర్ మీదుగా రామవరప్పాడు రింగ్ సెంటర్ వరకు కార్మిక ప్రదర్శన జరుగుతుందని, అనంతరం యం.కన్వెన్షన్‌లో ప్రతినిధుల సభ జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు, జిల్లా కోశాధికారి బి.బెనర్జీ, జిల్లా నాయకులు బి.గోవిందు, వి.బి రాజు, విజ్జి కనకారావు, యం.బాబురావు, రాము తదితరులు పాల్గొన్నారు. **మైలవరం :** ఈనెల 30న విజయవాడలో జరిగే బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ పదవ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు, డి.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం మైలవరంలో భవన నిర్మాణ కార్మికుల పని ప్రదేశాలలో కరపత్రాలు పంపిణీ చేశారు.

# గర్భాశయ కేన్సర్‌పై అవగాహన అవసరం




**ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :** భారతదేశంలో అత్యధికంగా మహిళల్లో కలిగే కేన్సర్లలో రెండో గర్భాశయ ముఖద్వార కేన్సర్ అని ప్రతి ఏటా మన దేశంలో 75వేల మంది మహిళలు ఈ వ్యాధికి గురై మరణిస్తున్నారని, చిన్న వయస్సులోనే హెచ్.పి.వి. వ్యాక్సిన్ తీసుకుంటే క్యేన్సర్ల నుండి రక్షణ పొందొచ్చని ప్రముఖ స్త్రీల వైద్య నిపుణురాలు కె.ప్రభాదేవి పేర్కొన్నారు. వాసవ్య నర్సింగ్ హోమ్‌లో డాక్టర్ సమరం అధ్యక్షతన శనివారం జరిగిన ఆరోగ్య సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని 'గర్భాశయ ముఖద్వార కేన్సర్–హెచ్.పి.వి. వ్యాక్సిన్" అంశంపై మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా ఏటా 5లక్షల మంది ఈ వ్యాధికి గురవుతుండగా భారతదేశంలో రోజుకి 200 మంది, గంటకు 8మంది, ప్రతి 7నిముషాలకి ఒక మహిళ మరణిస్తున్నారని తెలిపారు. 9–14 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలు ప్రతి ఒక్కరికి తప్పకుండా హెచ్.పి.వి. వ్యాక్సిన్ చేయించాలన్నారు. మూడు రకాల వ్యాక్సిన్లు చేయించాలన్నారు. మగపిల్లలకు కూడా వయస్సు లవారీగా ఈ వ్యాక్సిన్ వేయించాలని తద్వారా వారిలో కూడా పురుషాంగ కేన్సర్ రాకుండా నివారించ వచ్చన్నారు. ఈ వ్యాక్సిన్ వల్ల ఎటువంటి దుష్ఫలితాలు ఉండవన్నారు.

# సిఎం సహాయనిధి చెక్కులు అందజేత



వత్సవాయిలో బాధితులకు చెక్కు అందజేస్తున్న ఎంఎల్ఎ తాతయ్య

**ప్రజాశక్తి - వత్సవాయి :** ఆయాగ్రామాల్లోని లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులు ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య వారి వారి ఇళ్ల వద్ద వారికి శనివారం అందజేశారు. వత్సవాయి మండలంలో చిట్యాల గ్రామానికి చెందిన సయ్యద్ జాన్ బాషా, గంగవల్లి పోచవరం గ్రామానికి చెందిన తోట అంకమ్మ, తోట అరుణ, వేమవరం గ్రామానికి చెందిన కట్ట గిరికృష్ణ, మాచినేనిపాలెం గ్రామానికి చెందిన సాధినేని పుల్లారావు, బొల్లా రాణి, బోజడ్ల లక్ష్మి, కంభంపాడు గ్రామానికి చెందిన ఇంగువ భవాని శంకర్, మక్కపేట గ్రామానికి చెందిన నూతక్కి రాని, గుట్ట ఉమా ఫణీంద్ర, నరకుల్ల వెంకటేశ్వర్లు, అల్లూరుపాడు గ్రామానికి చెందిన ఆవుల శ్రీనివాసరావుకు మంజూరైన రూ.5 లక్షల 65 వేల 473 ల చెక్కులను అందజేశారు. **జగ్గయ్యపేట :** మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన మడతనపల్లి అర్జునరావు మంజూరైన రూ.40,350ల చెక్కును అందజేశారు.




డైమండ్స్‌ను ప్రదర్శిస్తున్న మోడల్స్

# మలబార్‌లో 'నువా టై మైన్ డైమండ్స్' ఆవిష్కరణ

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** అతిపెద్ద, అత్యంత విశ్వసనీయ బంగారు, వజ్రాభరణాల రిటైలర్ బాధ్యతాయుతమైన ఆభరణాల వ్యాపార సంస్థగా ప్రఖ్యాతిగాంచిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్, అద్భుతమైన సహజ వజ్రాభరణాల సేకరణ 'నువా టై మైన్ డైమండ్స్' అనే సరికొత్త కలెక్షన్ ప్రారంభించింది. ఈ సందర్భంగా నగరంలోని మలబార్ షోరూంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మార్కెటింగ్ మేనేజర్ షేక్ ఖాసిం మాట్లాడుతూ ప్యాట్రన్ ఆధునిక రూపాల ప్రేరణతో రూపొందించిన ఈ సేకరణ, మినిమలిస్ట్ లగ్జరీ చూపించే అద్భుతమైన డిజైన్ల శ్రేణిని అందిస్తున్నామన్నారు. సరికొత్త 'నువా కలెక్షన్'లో, 2–ఇన్–1 రింగులు, జిప్పర్–ఇన్‌స్పైర్డ్ నెక్లెస్లు, ఆధునిక చెవిపోగులు, రొటేటింగ్ బ్యాంగిల్స్ మొదలైన వినూత్న డిజైన్లను కలిగి ఉందని తెలిపారు. సంక్లిష్టంగా రూపొందించబడిన ఇటాలియన్ గొలుసులు కూడా ఈ కలెక్షన్లో ఉన్నాయి. అన్నారు .ఇవి కాలాతీత సౌందర్యాన్ని జోడిస్తాయని, అందుబాటు ధరల్లో లభించే ఈ కలెక్షన్ అన్ని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్లలో అందుబాటులో ఉన్నాయని అన్నారు.

# టిసిఎస్, టిడిఎస్‌లపై వ్యాపారులకు అవగాహన

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** పట్టణంలో శుక్రవారం రాత్రి శ్రీరాం అమ్మాణీ కళాశాలలో చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో టిడిఎస్, టిసిఎస్‌లపై వ్యాపారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విజయవాడ ఐటిఒ అనిల్ కుమార్, సెక్షన్ ఆఫీసర్ రామకృష్ణలు హాజరై వ్యాపారులకు టిసిఎస్, టిడిఎస్, జీఎస్టీలకు ఉన్న వ్యత్యాసాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా షరాబు వర్తక సంఘం అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, సంఘం ప్రధాన కార్యదర్శి కొంకిమళ్ళ మల్లికార్జున రావు, కోశాధికారి యర్రం శివప్రసాద్, సీనియర్ సభ్యులు రంగాపురం నరసింహారావు, మహంకాళి శ్రీనివాసరావు, దేవరశెట్టి నాగేశ్వరరావు తదితరులు ఐటిఓ, సెక్షన్ ఆఫీసర్లకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు తాడేపల్లి సోమేశ్వరరావు, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, వ్యాపారవేత్త బొగ్గవరపు రాజారావు, శ్రీరాం బదరీ నారాయణ, ప్రముఖ సిఏ పెనుగొండ రాజీవ్, అకౌంటెంట్లు పాల్గొన్నారు.

# ఘనంగా పివి జయంతి

**ప్రజాశక్తి - మైలవరం :** మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతిని కాంగ్రెస్ ఆధ్వర్యంలో మైలవరంలో శనివారం ఘనంగా నిర్వహించారు. బోసు బొమ్మ సెంటర్లో పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్ నివాళులు అర్పించారు.

# రోడ్డుపై వాహనాలు... ప్రజలకు ఇబ్బందులు

- నిత్యం బారులు తీరుతున్న వాహనాలు
- డేంజర్ జోన్లలో తరచూ రోడ్డు ప్రమాదాలు
- ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ రద్దీ



రోడ్డుపై నిలిపిన వాహనాలు

**ప్రజాశక్తి... గన్నవరం :** గన్నవరం మండలంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పలు గ్రామాల ప్రజలను నిత్యం ట్రాఫిక్ సమస్య పట్టి పీడిస్తోంది. ఎయిర్పోర్ట్, కేసరపల్లి, కొత్తపేట, వెంకటేశ్వర థియేటర్ సెంటర్, గాంధీ బొమ్మ సెంటర్, బస్టాండ్ సెంటర్, దావాజీగూడెం తదితర ఏరియాలు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్నాయి. దీంతో ఏ చిన్నపాటి అవసరం వచ్చినా ఆయా గ్రామాల వారు జాతీయ రహదారి పైకి రావాల్సిందే. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహ దారిపై నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తోంది. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల మీదుగా నిత్యం జాతీయ రహదారిపై వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో పలు సందర్భాల్లో గంటల కొద్దీ వాహనాలు నిలిచిపోతు న్నాయి. జాతీయ రహదారిని ఆనుకుని పలు పాఠశాలలు, వ్యాపార సంస్థలు ఉన్నాయి. దీంతో ఉదయం, సాయంత్రం రహదారిపై తీవ్ర రద్దీ ఏర్పడుతోంది. ట్రాఫిక్ చక్రబంధంలో ఇరుక్కుని నిర్ణీత సమయానికి గమ్యస్థానం చేరుకోలేకపోతున్నామని ప్రయాణికులు, విద్యార్థులు పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ట్రాఫిక్ ను నియంత్రించేందుకు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో పాఠశాల విద్యార్థులు, వద్దలు రహదారి పైకి రావాలంటేనే భయపడుతున్నారు.

**నిత్యం వాహనాలు బారులు :** పలు గ్రామాల్లో ముఖ్యంగా పలు కూడళ్లలో నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తుంది. గాంధీ బొమ్మ సెంటర్, వెంకటేశ్వరా థియేటర్ సెంటర్, కొత్తపేట సెంటర్ కూడళ్లలో నిత్యం వాహనాలు బారులు తీరుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదు. విజయవాడ నుంచి నుంచి వచ్చే భారీ వాహనాలు, ఇతర వాహనాలు జాతీయ రహదారి మీదుగా గన్నవరం మీదుగా హనుమాన్ జంక్షన్ చేరుకుంటాయి. అక్కడి నుంచి అవసరాన్ని గుడివాడ, నూజివీడు, ఏలూరు మీదుగా వెళతాయి. ఈ సమయంలో రహదారి సెంటర్లో భారీగా ట్రాఫిక్ నిలిచిపోతోంది.

**ప్రత్యామ్నాయ రహదారిని పట్టించుకోరే? :** ప్రత్యామ్నాయ బైపాస్ రహదారిని పట్టించుకునే నాధుడే కరువయ్యారని పలు గ్రామాల వారు ఆరో పిస్తున్నారు. డేంజరస్ ఏరియాలుగా పిలువబడే ఈ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమ య్యాయి. ఒక్క గన్నవరంలోనే ఇటీవల సుమారు 5 మందికి పైగా మృత్యువాత పడ్డారు. పలువురు క్షతగాత్రులయ్యారు.

**గాంధీ బొమ్మ సెంటర్ వద్ద నిత్యం ట్రాఫిక్ :** ఏరేంజ్లో నిలుస్తుందో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. వెంకటేశ్వర థియేటర్ సెంటర్లో ట్రాఫిక్ విషయంలో మరో డేంజర్ జోన్ గా మారింది.బైపాస్ వెళ్లే ప్రత్యామ్నాయ రహదారిని పట్టిం చుకుంటే భవిష్యత్లో భారీ వాహనాలకు అతి సులువైన మార్గం అవుతుంది. ఈ రహదారిలో ఉన్న కొద్దిపాటి ఆక్రమణలు తొలగించి అభివృద్ధి పరిస్తే జాతీయ రహదారిపైకి వాహనాలు ఎక్కా ల్సిన అవసరం ఉండదు. గన్నవరం ఎయిర్పోర్టు నుంచి వచ్చే ఎమ్మెల్యేలు, మంత్రుల కాన్వాయ్లు కూడా ఈ ప్రత్యామ్నాయ మార్గంలో ఎవరికీ ఇబ్బం ది లేకుండా వెళ్లవచ్చు. దీంతో చాలా వరకూ ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టవచ్చు. నిత్య వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అధికా రులు చర్యలు తీసుకోవాలని, ప్రత్యామ్నాం. రహదారి అంశాన్ని దృష్టిలో పెట్టుకోవాలని ప్రయాణికులు, పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన



**ప్రజాశక్తి - పామర్రు :** 18 సంవత్సరాల వయస్సు కలిగిన వారు తమ ఓటు హక్కును నమోదు చేసు కోవాలని పామర్రు నియో జకవర్గ ఎన్నికల ఎలక్టోరల్ అధికారి, జిల్లా బీసీ సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ జి రమేష్ అన్నారు. నియోజవర్గ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అర్హత గల యువత యువకులు తమ ఓటు హక్కు కోసం స్థానిక తాసిల్దార్ కార్యాలయాల్లో సంప్రదించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధంగా మంచి వారిని ప్రజాప్రతినిధులుగా ఎన్నుకునే అవకాశం ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన పట్ల స్థానిక అధికారులకు పలు సూచనలు సలహాలు అందించారు. 1200 ఓటర్లు కలిగిన బూతులను రెండు బూతులుగా విభజించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అంశాలను వివరించారు. కార్యక్రమంలో పామర్రుతాసిల్దార్ గోడపాటి రవికాంత్, ఎన్నికల డిప్యూటీ తాసిల్దార్ బి రజనీకాంత్, సీనియర్ అసిస్టెంట్ అనినయ్య, పలువురు గ్రామ వీఆర్వోలు బూతుల విల్లింగ్ అధికారులు పాల్గొన్నారు.



## గ్రామాల అభివృద్ధిలో దాతలు భాగస్వాములు కావాలి : ఎంఎల్ఎ



బోర్ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - గుడివాడ :** గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషిలో దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం గుడివాడ రూరల్ మండలం లింగవరం గ్రామంలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన పంచాయతీ బోర్ ను ఎమ్మెల్యే రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా 75 శాతం సబ్సిడీతో పశుగ్రాస విత్తనాలను పాడి రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. పేద వర్గాల అభ్యున్నతికి గొప్ప సంకల్పంతో సిఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన పి.4లో ప్రవాసాంధ్రులు, దాతలు భాగస్వామ్యులు కావాలన్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో నియోజకవర్గంలోని గ్రామాల ప్రగతికి అనేక చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్రావు, మార్కురాజ్, గాదిరెడ్డి చిరంజీవిరెడ్డి, మందపాటి గోపాలస్వామి, కొత్తకోట వెంకటశివనాగరాజు, పెనుగోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు సన్మానం



**ప్రజాశక్తి-మొవ్వ :** సంపూర్ణ పారిశుధ్య గ్రామంగా కూచిపూడి గ్రామం గుర్తింపు పొందిన సందర్భంగా గ్రామ సర్పంచ్ పర్యవేక్షణలో పంచాయతీ పాలకమండలి పారిశుధ్య కార్మికులను శనివారం సత్కరించారు. ఐ.వి.ఆర్.ఎస్ ద్వారా నూరు శాతం నమోద వడంతో ఆరుగురు కార్మికులను శాలువాలతో పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. సర్పంచ్ దంపతులు కొండవీటి వెంకటరమణ, విజయలక్ష్మి అమర బాలేశ్వరరావు, కార్యదర్శి కే పుష్ప నాదం, విశ్రాంత ఈఓపిఆర్డి (పెడన) మద్దాల జయరాం పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలు నెరవేర్చాలి : కాంగ్రెస్

**ప్రజాశక్తి-పమిడిముక్కల :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరకాలం అయినా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, హామీలను వెంటనే అమలుపరచాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బనావత్ భుజంగం నాయక్ అన్నారు. శనివారం ఆయన మండలంలోని కూడేరులోని తన నివాసంలో మాట్లాడారు. రైతులకు రైతు భరోసా ఇవ్వలేదని, మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చెప్పి చాలామందికి నగదు జమచేయలేదన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తానన్న ప్రభుత్వం నిరుద్యోగులను పట్టించుకోవడంలేదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు.

## రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాశక్తి-కంకిపాడు :** పల్లె పండుగ - ప్రగతికి బాట అనే కార్యక్రమం ద్వారా కోమటిగుంట లాకులు గ్రామం నుండి జగన్నాధపురం గ్రామం వరకు నూతన రోడ్డు నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ. 34 లక్షలు మంజూరయ్యాయని స్థానిక కూటమి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎయిర్పోర్ట్ అథారిటీ మెంబర్ ముప్పారాజా,మార్కెట్ యార్డ్ చైర్మెన్ అన్నే ధనయ్య,టిడిపి పార్టీ మండల అధ్యక్షులు సూది మల్ల రవీంద్ర, కంకిపాడు మండల జనసేన పార్టీ అధ్యక్షులు సుంకర శివ, కంకిపాడు జనసేన పార్టీ అధ్యక్షుడు బోయిన నాగరాజు పాల్గొన్నారు

## పారదర్శకంగా మహిళా పోలీసుల బదిలీలు : ఎస్పి

**ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) :** రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనల అనుగుణంగా మహిళా పోలీసుల బదిలీ ప్రక్రియ జరుగుతోందని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు తెలిపారు. సాధారణ బదిలీల్లో భాగంగా శనివారం ఎన్టీఆర్ జిల్లా, ఏలూరు జిల్లాలకు చెందిన మహిళా పోలీసుల బదిలీ ప్రక్రియ జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో మీ కోసం సమావేశ హాలులో నిర్వహించారు. ఈ బదిలీలలో ముందుగా కౌన్సిలింగ్ నిర్వహించి వారు కోరుకున్న ప్రదేశాలకు బదిలీ చేసేలా చర్యలు చేపట్టారు. శనివారం మొత్తం 530 మంది మహిళా పోలీసులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ఈ బదిలీల్లో మ్యూచువల్ ట్రాన్స్ఫర్, స్పౌస్ కోట, దివ్యాంగులకోట, ఆరోగ్య సమస్యల ప్రాతిపదికన బదిలీలు చేపట్టామన్నారు.



మహిళా పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పి

# ప్రతిఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుట్టల గోపి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) :** చట్టాలపై అవగాహన కలిగి ఉండి, అవసరం మేరకు మాత్రమే వాటిని ఉపయోగించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గుట్టల గోపి అన్నారు. శనివారం ఉదయం స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా పరిపాలనా యంత్రాంగం సంయుక్తంగా నూతన తరహా న్యాయ సేవల శిబిరం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తితో పాటు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు, 9వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్ సుజాత, 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి బాబు నాయక్, పోక్సో కోర్టు జిల్లా న్యాయమూర్తి జి వెంకటేశ్వర్లు, పర్మనెంట్ లోక్ అదాలత్ చైర్మన్ వి నాగేశ్వరరావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య, మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతురాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వానికి న్యాయ వ్యవస్థలకు మధ్య జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డిఎల్ఎస్ఏ) వారధిగా ఉండి పని చేస్తుందన్నారు. సామాన్యులకు న్యాయం అందుబాటులో ఉంచడం, సాంఘిక దురాచారాల పోరాటంపై ప్రజలకు అవగాహన కల్పించడం, పిల్లల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుండా దూరమైన వారిని గుర్తించి వారికి చేరువ చేసేలా చర్యలు తీసుకోవడంపై డిఎల్ఎస్ఏ విశేష కృషి చేస్తుందన్నారు. డిఎల్ఎస్ఏ ప్రజలకు న్యాయ సేవలను ఉచితంగా అందిస్తుందని, అయితే ఉచితంగా అందించే సేవల పట్ల చులకన భావన కలిగి ఉండొద్దని, మార్పు అవసరం అని చెబుతూ న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ న్యాయ సేవలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డిఎల్ఎస్ఏ) అందిస్తున్న న్యాయ సేవలను ప్రజలకు అవగాహన కల్పించటం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. కోర్టు కేసులకు సంబంధించి, న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేని పేద ప్రజలు డిఎల్ఎస్ఏ ను సంప్రదిస్తే న్యాయవాదిని ఏర్పాటు చేసి ఉచిత న్యాయ సహాయం అందిస్తుం దన్నారు. లోక్ అదాలత్ కోర్టు ద్వారా ఎటువంటి కేసులనైనా సత్వరంగా పరిష్కరించుకునే అవకాశం ఉందని, ఇరువురు రాజీ పడే అవకాశం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ తదితరులతో కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయోవద్ధుల సంక్షేమ శాఖ ఏడి కామరాజు, బీసీ వెల్ఫేర్ అధికారి జీ రమేష్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫణి ధూర్జటి, ఏపీఎస్ ఆర్టీసీ ప్రజా రవాణాధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సౌమ్యను సన్మాయనిస్తున్న ప్రవాస భారతీయులు

## ఎంఎల్ఎ సౌమ్యకు అమెరికాలో సత్కారం

**ప్రజాశక్తి - నందిగామ :** నందిగామ ఎంఎల్ఎ, ఎపి ప్రభుత్వ విప్, తంగిరాల సౌమ్యను అమెరికా రాజధానిలో ప్రవాస భారతీయులు, వారి తల్లిదండ్రుల సమక్షంలో శుక్రవారం రాత్రి ఘనంగా సత్కరించారు. విద్యావంతురాలు, రాజకీయ వారసత్వ విలువలో టిడిపి విప్‌గా, ప్రజా సేవలో సాగుతున్న సౌమ్యను తానా మాజీ అధ్యక్షులు సతీష్ వేమన, గుంటూరు మిర్చి యార్డ్ మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు అభినందించారు. భాను మాగులూరి, సతీష్ చింతా, రంజిత్ కోమటి ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.



## ఆషాఢ సారె సమర్పణ

**ప్రజా శక్తి - విజయవాడ సిటీ :**

ఆషాడసారె మహోత్సవంలో దశావతార భక్త బృందం పాల్గొంది. శనివారం బెజవాడ కనకదుర్గమ్మకు దశావతార బృందం ఆషాడసారె సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆషాడం సారెను చిట్టినగర్ నగరాల కొత్త అమ్మవారి దేవస్థానం నుంచి వందమంది దశావతార అమ్మవారి యాత్రికుల బృందం మేళతాళాలు డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా సాగారు. ఆంజనేయ వాగు, నెహ్రూ బొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి, కనకదుర్గ నగర్ మీదుగా ఇంద్రకీలాద్రికి చేరుకొని సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో పోతిన విజయలక్ష్మి, పిళ్ళా మాధవి, పోతిన పుష్పలత, పోతిన భవాని, అడ్వకేట్ పోతిన పుష్పలత, తాత్రాజుల ఉమాదేవి, గుజ్జారి భవాని, పోతిన దుర్గ భవాని, పిళ్లా రాణి, పిల్ల హారతి తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయంపై శిక్షణ

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** మండలంలోని గరికపాడు వ్యవసాయ పరిశోధన స్థానంలో శనివారం వ్యవసాయ, అనుబంధ శాఖల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ కృష్ణంరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరి, ప్రతి, మిరప, మొక్కజొన్న, అపరాలు, ఇతర పంటల యాజమాన్య పద్ధతులను, విత్తన శుద్ధి, నారుమళ్ళ యాజమాన్యం, కలుపు నివారణ, సేంద్రియ వ్యవసాయం, నీటి యాజమాన్యం వంటి అంశాలపై శాస్త్రవేత్తల సలహాలిచ్చారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.అచ్యుత రాజు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ రత్నశ్రీ, డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.




వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు

## 'అమ్మ' మార్గదర్శనంతో బంగారు కుటుంబాలకు బాటలు : కలెక్టర్



**ప్రజాశక్తి-విజయవాడ :** సామాజిక కార్యక్రమాల నిర్వహణలో ప్రత్యేక గుర్తింపు సాధించిన ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ).. పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన వినూత్న పీ4 విధానం అమల్లోనూ భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కోరారు. ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) ప్రతినిధులు శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశతో సమావేశమయ్యారు. పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించి ఉన్నత విద్య అభ్యసించేందుకు అసోసియేషన్ కృషిచేస్తోందని.. ఏటా దాదాపు 450 మందికి రూ. 18 లక్షల ఉపకారవేతనాలు అందిస్తున్నట్లు వివరించారు. మొగల్రాజపురంలోని బోయపాటి శివరామ కృష్ణయ్య మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌ను దత్తత తీసుకొని విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు వంటివాటిని అందించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ నగరంలో ఆదర్శవంతమైన పాఠశాలగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ అమ్మ అసోసియేషన్ సేవా కార్యక్రమాలను ప్రశంసిస్తూ గౌరవ ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పీ4 (ప్రభుత్వం, ప్రైవేటు, ప్రజలు భాగస్వామ్యం) విధానాన్ని తీసుకొచ్చిందని తెలిపారు.

## బ్యాంకుల దోపిడీ నుంచి లబ్ధిదారులను కాపాడాలి

**ప్రజాశక్తి - విజయవాడ :** ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఎవై) ఎపి టిట్కో ఇళ్లను సదరు లబ్ధిదారులకు కేటాయించకుండా, బ్యాంకు రుణం పొందారనే పేరుతో లబ్ధిదారుల బ్యాంక్ ఎకౌంట్లను అటాచ్ చేసి, వారి సేవింగ్స్‌ను జమ చేసుకోవడం అత్యంత దారుణమని, ఇటువంటి వ్యవహారాన్ని పరిష్కరించాలని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు కోరారు. ఈ మేరకు నగర కమిషనర్ ధ్యానచంద్రకు సత్యబాబు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ జక్కంపూడి ప్రాంతంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించకుండా, లబ్ధిదారుని బ్యాంక్ అకౌంట్‌కు బ్యాంకు రుణం అటాచ్మెంట్ చేసి, లబ్ధిదారులు రుణం చెల్లించలేదనే సాకుతో అతని అకౌంట్‌ను ఫ్రీజ్ చేసి హోల్డ్‌లో పెట్టి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. లబ్ధిదారులు కష్టించి పనిచేసి సంపాదించుకున్న కొద్దిపాటి డబ్బును సైతం బ్యాంకు అధికారులు స్వాధీన పరుచుకోవడం దారుణమన్నారు. ఈ సమస్యను పలుమార్లు కౌన్సిల్ దృష్టికి ప్రతిపాదనలు రూపంలోనూ, వినతిపత్రం రూపంలోనూ తెలియజేసినా ప్రయోజనం లేకుండా పోతోందని అన్నారు. కమిషనర్ వెంటనే తగు చర్యలు చేపట్టాలని, లేనట్లయితే బ్యాంకు రుణం అటాచ్ అయి లబ్ధిదారులను సమీకరించి ఆందోళన చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. దీనిపై వెంటనే కమిషనర్ స్పందించి, బ్యాంక్‌ల నుంచి లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం రాంబాబుపాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సత్యబాబు

## మత్తుకు బానిసలై ఉజ్వల భవిష్యత్తుకు దూరం కావొద్దు

**ప్రజాశక్తి - తిరువూరు :** యువకులు, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు అవటంవల్ల తమ ఉజ్వల భవిష్యత్తును కోల్పోతున్నారని తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అట్లూరి సింధూర అన్నారు. మండల న్యాయ సేవా అధికారిక సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఏ కొండూరు మండలం, కృష్ణారావుపాలెంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల బాలుర పాఠశాలలో జరిగిన డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మత్తు పదార్థాలు సేవిస్తే బంగారు భవిష్యత్తును మొత్తం పూర్తిగా నాశనం చేసుకుంటారని చెప్పారు. విద్యార్థులందరూ ఉన్నత విద్యనభ్యసించి తమ కుటుంబాలను ఆర్థికంగా బలపరుచుకుని, తద్వారా దేశ అభివృద్ధికి దోహదపడాలన్నారు. ప్రభుత్వం విద్యార్థులందరికీ ఉన్నత విద్యను అందించాలనే ఉద్దేశంతో పలు రకాల సంక్షేమ పథకాలను పేద విద్యార్థులకు అంది స్తుందని వాటిని ఉపయోగించుకోవా లని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో తిరువూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు చింతల వెంకటరెడ్డి, ఉచిత న్యాయ సలహాదారు మేకల నాగేంద్ర ప్రసాద్, పాఠశాల ప్రిన్సిపాల్ కె.సిద్దయ్య, సీనియర్, ఎజిపి ఎం.రాము, సీనియర్ న్యాయవాదులు సంకురాత్రి జనార్ధనరావు, నాగుబండి రామకృష్ణ, మొగపర్తి సత్యం, షేక్ సుభాని, చిలకా హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సింధూర

## పేటలో ఎంఎల్ఎ రాజగోపాల్ పర్యటన

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** పట్టణంలోని 22వ వార్డులో వారి సమస్యలను తెలుసుకునేందుకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య శనివారం పర్యటించారు. ప్రజలు పలు సమస్యలను విన్నవించారు. అనంతరం ఆ సమస్యలను యుద్ధ ప్రాతిపదికన వీధిలైట్లు, బోరు ఏర్పాటు చేశారు. మంచినీటి సమస్య ఉందని తెలపడంతో పైప్‌లైన్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రాజగోపాల్ మాట్లాడుతూ పట్టణంలో అత్యవసరంగా చేయవలసిన పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడతామని, జగ్గయ్యపేట పట్టణ అభివృద్ధికై ముందుకెళ్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల కుమార్ రాజా, వార్డు కౌన్సిలర్ గొట్టే నాగరాజు, జగ్గయ్యపేట పట్టణ కమిషనర్ తులసి వెంకట కృష్ణారావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివ కోటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పర్యటలో ఎంఎల్ఎ శ్రీరాం, మున్సిపల్ చైర్మన్, తదితరులు

## పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు దూరం

**ప్రజాశక్తి - రెడ్డిగూడెం :** డ్రైడే కార్యక్రమంలో భాగంగా రెడ్డిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్. మణిబాబు, రంగాపురం సచివాలయంలోని గ్రామాలైన రంగాపురం, బూరుగగూడెంను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభవడంతో ప్రజలందరు, తమ ఇంటి పరిసరాలను, పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటిపరిసరాలలో నీరు నిల్వలేకుండా చూసుకోవాలని, ఒకరోజు ఇంటిలోను, ఇంటి పరిసరాలలోని, నీటి తొట్టెలను శుభ్రం చేసుకోవాలని తెలిపారు.



## గీతాంజలిలో విద్యార్థి ఎన్నికలు

**ప్రజాశక్తి - రెడ్డిగూడెం :** రెడ్డిగూడెం మండల కేంద్రంలో గల గీతాంజలి హైస్కూల్‌లో ఎస్‌పిఎల్ (అండ్) సిపిఎల్ ఎన్నికల బూత్‌లను స్థానిక ఎంఇఒ నరసింహారావు, రమేష్ ప్రారంభించారు. శనివారం స్థానిక గీతాంజలి హైస్కూల్‌లో విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంఇఒ నరసింహారావు రమేష్ హాజరై దేశంలో జరుగుతున్న ఎన్నికల విధానాలను విద్యార్థులకు తెలియజేస్తున్న యాజమాన్యాన్ని అభినందించారు. ఓటింగ్ సరళిని, బ్యాలెట్ పేపర్లను, చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్ రెడ్డి, కరెస్పాండెంట్ కోటిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రజకులకు ప్రభుత్వం సౌకర్యాలు కల్పించాలి

**ప్రజాశక్తి - గంపలగూడెం :** మండల వ్యాప్తంగా ఉన్న రజకులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కృషి చేయాలని రజక సంఘం మండల సంఘ అధ్యక్షులు నాగారపు కృష్ణారావు కోరారు. తోట మూలలో ఉన్న ఓ మండపంలో రజక సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో కృష్ణ పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఇంటికి 200 యూనిట్లు లోపు ఉచిత విద్యుత్ వర్తింపచేయాలని, ధోబి ఘట్ల నిర్మాణానికి ఆర్థిక సాయం చేయాలని, తదితర అంశాలను ఈ సందర్భంగా వెల్లడించారు. జూలై 6న రాజమండ్రిలో జరిగే రజకసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల రజక ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న కమల

## తీర్మానాలు ఇవ్వనందున రహదారుల నిర్మాణం నిలుపుదల

**ప్రజాశక్తి - గంపలగూడెం :** మండల పరిషత్ నిధుల నుండి గ్రామాల్లో సిసి రహదారులు ఏర్పాటుకు అనుమతి లభించినా, పంచాయతీ తీర్మానం ఇవ్వనందునే రహదారుల నిర్మాణం నిలిచిపోయినట్లు అనుముల లంక గ్రామ ఎంపిటిసి సభ్యురాలు గౌరసాని కమల ఫిర్యాదు చేశారు. శనివారం స్థానిక మండల పరిషత్‌లో ఎంపిడిఒ పివిఎస్ నాగేశ్వరరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమల మాట్లాడుతూ, గత సమావేశంలో ఆరు రహదారులకు గానూ 13 లక్షలు నిధులు ఆమోదిస్తూ విడుదల చేసినట్లు చెప్పారు. గ్రామంలో రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ పంచాయితీ సర్పంచ్ గాని, అధికారి కానీ పట్టించుకోవడం లేదని వాపోయారు. తీర్మానం లభిస్తే రహదారులు వేగంగా నిర్మిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గోగులమూడి శ్రీలక్ష్మి, జడ్పిటిసి సభ్యుడు కోట శామ్యూల్ పాల్గొని పలు అంశాలపై మాట్లాడారు. వివిధ గ్రామాల ఎంపిటిసిలు సర్పంచులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


# దేశ వ్యాప్త సమ్మె నోటీసులు అందజేత


మోపిదేవి మండలంలో...


గుడ్లవల్లేరు మండలంలో...



గుడివాడలో...


చల్లపల్లి మండలంలో...

**ప్రజాశక్తి-మోపిదేవి (చల్లపల్లి) :** కార్మిక సమస్యల పరిష్కారానికి దేశవ్యాప్తంగా జులై 9వ తేదీన నిర్వహించే సమ్మెలో పాల్గొంటామని, విధులకు హాజరుకాబోమని పంచాయతీ కార్మికులు చల్లపల్లి మండలం లక్ష్మీపురం పంచాయతీ కార్యదర్శి మహేశ్వరరావుకు శనివారం సమ్మె నోటిసు అందించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మికులు సాధించుకున్న 44 చట్టాలను సవరించి ఫ్యాక్టరీ పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్స్ లను తీసుకువచ్చి కార్మికులను కట్టు బానిసలుగా మార్చిందని ఆయన ఆరోపించారు. కార్మిక వర్గానికి కనీసం 26 వేల రూపాయలు వేతనాలు చెల్లించాలని టెండర్ కాంట్రాక్ట్ కార్మికులందరికీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ కార్మికుల యూనియన్ సభ్యులు మద్దాల శ్రీరాములు, కార్మికులు కె.మహాలక్ష్మి కె. శశి,మట్టా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** జులై 9న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అంగన్వాడి కార్యకర్తలు శనివారం పిలుపునిచ్చారు. అంగన్వాడీ లకు కనీసవేతనం 26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ,రిటైర్ మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని,, సంక్షేమ పథకాలు వర్తింప జేయాలని కోరుతూ ఐసిడిఎస్ గుడివాడ ప్రాజెక్టు గుడ్లవల్లేరు మండల పరిధిలోని ,కవుతరం సెక్టార, డోకిపర్రు సెక్టార్, గుడ్లవల్లేరు సెక్టార్లలో అంగన్వాడి కార్య కర్తలు ధర్నాలు నిర్వహించారు. సిఐటియు మండల అధ్య క్షులు పి జయలక్ష్మి, కొడాలి అమ్మాజీ,మౌనిక గ్రేస్ వెంకటేశ్వరమ్మ, విజయలక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

అలాగే గుడ్లవల్లేరు మండలంలో గుడ్లవల్లేరు పంచాయతీ కార్మికులు, గుడ్లవల్లేరు మండల మధ్యాహ్నం భోజన పథకం కార్మికులు సమ్మె నోటీసులను శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళ కష్ణాజిల్లా కన్వీనర్ ధనశ్రీ సిఐటియు ఉపాధ్యక్షులు ఆర్‌సిపి రెడ్డి మధ్యాహ్న భోజనం పథకం నాయకురాలు రమాదేవి, సునీత, నదియా ,పంచాయతీ కార్మికులు లక్ష్మీ ,రమేష్ అరుణ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మోపిదేవి :** కార్మికుల ప్రయోజనాలను హరిస్తున్న ప్రభుత్వ విధానాలను అన్ని కార్మిక సంఘాల ఐకమత్య పోరాటాలతో ఎదుర్కొంటామని సిఐటియు జిల్లా కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు . మోపిదేవి మండలం పెదకళ్ళేపల్లి గ్రామం పంచాయతీ కార్యదర్శికి శనివారం ఆయన మోపిదేవి మండల కమిటీ సభ్యులతో కలిసి సమ్మె నోటీసు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గాల సంక్షేమం ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయన్నారు. మార్కెట్లో అన్ని వస్తువులు ధరలు పెరిగిపోయిన కార్మికుడి జీతం మాత్రం పెరగలేదన్నారు. కార్మికులు జీతాలు పెంచడానికి ప్రభుత్వానికి నిధులు ఉండవు కానీ కార్మికుల పనిగంటల పెంచి పెట్టుబడిదారులకు వెట్టిచాకిరి చేయించడానికి మాత్రం ప్రభుత్వాలు నడుపుతున్న నాయకులకు మనసు ఉటుంది అన్నారు. జులై 9 వ తేదీ చేపట్టనున్న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మోపిదేవి మండలం సిఐటియు కార్యదర్శి సిరివెళ్ల రాజశేఖర్ గ్రామపంచాయతీలో పనిచేసే కార్మికులు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** జూలై 9 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను గుడివాడ టౌన్‌లో ఉన్న ఆశ వర్కర్లందరూ పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ధనశ్రీ పిలుపునిచ్చారు. శనివారం గుడివాడ సిఐటియు కార్యాలయంలో ఆశ వర్కర్ యూనియన్ గుడివాడ టౌన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ధనశ్రీ మాట్లాడుతూ ఆశ వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలకు సంబంధించిన జీవోలను వెంటనే అమలు చేయాలని, కనీస వేతనం 26,000 ఇవ్వాలని, వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు సరోజ, జిల్లా కమిటీ సభ్యురాలు భవాని, ప్రసన్న, ఆదిలక్ష్మి, హేమ, రాణి పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : యార్లగడ్డ

**ప్రజాశక్తి-గన్నవరం :** రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు. బాపులపాడు మండలం పెరికిడు గ్రామంలో శనివారం సాయంత్రం ఏలూరు కాలువ నుండి యార్లగడ్డ కాకులపాడు ఛానల్ కు సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్ణా డెల్టా పరిధిలో సాగునీరు ఆలస్యంగా విడుదల చేయడంతో వరి సాగు ఆలస్యమై పంటల సక్రమంగా పడటం లేదని, దీనికి తోడు పంట చేతికందే సమయంలో వస్తున్న తుఫానుల కారణంగా పంటలు దెబ్బతింటున్నాయని దీన్ని నివారించి రైతాంగానికి మేలు చేసేందుకు ఈ ఏడాది ముందుగానే కష్ణ డెల్టాకు సాగునీటి విడుదల చేసినట్లు చెప్పారు. సకాలంలో నీరు విడుదల చేయడం వల్ల పంటలు సమద్ధిగా పండుతాయని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమల శెట్టి రమేష్ బాబు, డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, వైస్ చైర్మన్ గోపాలకష్ణ, టిడిపి నాయకులు దయ్యాల రాజేశ్వరరావు, చిన్నాల చిన్నా, వేగిరెడ్డి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు

- పొంచి ఉన్న ప్రమాదం


విద్యుత్ స్తంభం చూస్తున్న స్థానికులు

**ప్రజాశక్తి-మొవ్వ :** మొవ్వ మండలంలోని నిడుమోలు గ్రామ పంచాయతీ పరిధిలోని నిడుమోలు, వీరాయిలంకలలో సుమారు అయిదు విద్యుత్ స్తంభాలు శిథిలమై ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు నెలల క్రితమే ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ సచి వాలయంలో వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. ఇంత వరకు పరిశీలించిన దాఖలాలు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిడుమోలు ప్రభుత్వ వైద్యశాల వద్ద , ప్రభుత్వ మద్యం దుకాణం వీధి చివర, అలాగే మరో రెండు చోట్ల విద్యుత్ స్తంభాలు శిథిల మై ఉన్నాయి. వచ్చేది వర్షాకాలం ఈదురు గాలులు బలమైన వర్షాలు పడే సందర్భం కాబట్టి వెంటనే సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలను మార్పించాలని సిపిఎం జిల్లా నాయకులు మండల కార్యదర్శి శీలం నారాయణరావు, నిడుమోలు శాఖ సీనియర్ సభ్యులు మద్దుల బసవరావు, సిపిఎం నిడుమోలు శాఖ కార్యదర్శి ఉప్పలపు వెంకటాద్రి కోరారు.


వివరాలు అడిగి తెలుసుకుంటున్న జెసి

## బుసుక భూములు పరిశీలన

**ప్రజాశక్తి-తోట్లవల్లూరు :** మండలంలోని దేవరపల్లి సొసైటీ భూములలో శనివారం జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ పర్యటించారు. తాసిల్దార్ కుసుమ కుమారి, మైనింగ్ ఏడి రామిరెడ్డి, ఆర్డీవో హేలా షారోన్, వ్యవసాయ అధికారిణి శ్రీదేవి, ఇరిగేషన్ రెవెన్యూ శాఖ అధికారులతో కలిసి ఆమె ఎస్సీ సొసైటీ భూముల్లోని బుసకను పరిశీలించారు. గతంలో ఈ బుసక మేటలను తవ్వుకునేందుకు అర్జీలు దాఖలు చేసుకున్నారని, అందులో భాగంగా వీటిని పరిశీలించడానికి వచ్చినట్లు తాసిల్దార్ తెలిపారు.

# విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ


బ్యాగులు, పుస్తకాలు ఇస్తున్న దాతలు

**ప్రజాశక్తి-గన్నవరం :** గన్నవరం మండలం దావాజీగూడెంలో ఎంఈఎఫ్ నాయ కులు ఏసుబాబు దేవరపల్లి ఆధ్వర్యంలో శనివారం పిఆర్‌కె. ఫౌండేషన్ రామకృష్ణ సహకారంతో పేద పిల్లలకు నోట్ పుస్తకాలు, పెన్నులు, బ్యాగులు, బాక్స్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎస్సీ సెల్ రాష్ట్ర నాయ కులు నిడమర్తి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. గన్నవరం సర్పంచ్ సౌజన్య మాట్లాడుతూ.. విద్యా దానం అన్ని దానాల్లో కంటే గొప్పదని చెప్పారు. బాగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పిఆర్‌కె చేస్తున్న సేవలను కొనియాడారు. పి ఆర్ కె ఫౌండేషన్ చైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ చదువు కంటే గొప్ప ఆస్తి మరొకటి లేదన్నారు. దళిత కుటుంబాల్లోని అందరూ పిల్లలు చదివించాలి అన్నారు. తాను కష్టపడి చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగినట్లు చెప్పారు. తాను సంపాదించిన దాంట్లో కొంత సమాజ సేవకు కేటాయించినట్లు తెలిపారు. మంచి పనులు చేయడం ద్వారానే జీవితానికి సార్థకత చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దలు బాల శ్రీనివాసరావు, చౌదరి, శేషు కుమార్, ,జోసెఫ్, దేవరపల్లి ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు : ఎంఎల్ఎ

**ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ ( గన్నవరం) :** గన్నవరం నియోజకవర్గంలో 24 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా కు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. తేలప్రోలు, వీరవల్లి విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలోను మల్లవల్లి గ్రామంలోనూ 50 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్తు లైన్లు శిథిలావస్థకు చేరి తరచూ అవాంతరాలు ఏర్పడుతుండటంతో స్థానికులు సమస్యను ఎమ్మెల్యే వెంకట్రావు దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన యార్లగడ్డ ఈ సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించి నిధులు మంజూరు చేయించారు. దీంతో బాపులపాడు మండలం వీరవల్లి, తేలప్రోలు విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ అవాంతరాలను తొలగించేందుకు రూ. 2.3 కోట్ల ఖర్చుతో నూతన లైన్ల నిర్మాణానికి కానుమోలు 132 కెవి విద్యుత్ కేంద్రం వద్ద ఎమ్మెల్యే యార్లగడ్డ శంకుస్థాపన చేశారు. బాపులపాడు మండలం మల్లవల్లి గ్రామానికి 24 గంటల విద్యుత్ సరఫరా కు నూతన లైన్ల నిర్మాణం విద్యుత్ స్తంభాల మార్పు కోసం 3.5 కోట్ల ఖర్చుతో చేపట్టిన నిర్మాణ పనులను శనివారం సాయంత్రం వెంకట్రావ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గంలోని గ్రామాల్లో శిథిలావస్థకు చేరిన విద్యుత్ లైన్ల స్థానంలో కొత్త లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్సీ సత్యానంద్ ఏడిఈ బి శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు, టిడిపి నాయకులు ఆళ్ల గోపాలకృష్ణ, దయ్యాల రాజేశ్వరరావు, ఆరుమళ్ళ వెంకట కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

**ప్రజాశక్తి-అవనిగడ్డ :** ఇటీవల మండల పరిధిలోని పులిగడ్డ గ్రామంలో రెండు రోజుల క్రితం మృతి చెందిన టిడిపి కార్యకర్త బొర్రా నాగ శ్రీను కుటుంబానికి అవనిగడ్డ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ తరపున ఆ పార్టీ నేత బొ బ్బా గోవర్ధన్ రూ 50 వేల ఆర్థిక సహాయం చేశారు. శనివారం నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావుతో కలసి నాగ శ్రీను కుటుంబాన్ని పరామర్శించిన గోవర్ధన్ వారి ఇద్దరి పిల్లలను చూసి స్పందించి ఈ మొత్తాన్ని ఆ కుటుంబానికి అందజేశారు. దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, పార్టీ నాయ కులు బండే శ్రీనివా సరావు, కర్ర సుధా కర్, మెండు లక్షణరావు, పర్చూరీ దుర్గాప్రసాద్ తది తరులు పాల్గొన్నారు.


సాయం అందిస్తున్న నాయకులు


మాట్లాడుతున్న జనసేన పార్టీ నాయకులు

## జనసేన నాయకులపై విమర్శలు తగదు

**ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్:** జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌ను, మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణను విమర్శించే నైతిక హక్కు వైసిపి నాయకులకు లేదనీ జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు పేర్కొన్నారు. శనివారం మచిలీపట్నం జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన నాయకులు పత్రికలతో మాట్లాడారు. పవన్ కళ్యాణ్ ను ఊసరవెల్లి అంటూ రామకష్ణకు స్థాయి లేదంటూ వైసీపీ నాయకులు చేసిన విమర్శలను జనసేన పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో డిసి వైస్ చైర్మన్ శాయన శివయ్య, గొల్లపాలెం జనసేన పార్టీ ఇంచార్జ్ గణేష్ రామారావు, పోతేపల్లి జనసేన ఇన్చార్జ్ వేమూరి వెంకటేశ్వరావు, బండి శివ తోట రాజేష్, కర్రి మహేష్, మహమ్మద్ బాషి పాల్గొన్నారు.



గోడ కూలిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్నసత్యబాబు, తదితరులు

## రిటైనింగ్ వాల్ ఘటన బాధితులకు న్యాయం చేయాలి: సత్యబాబు

**ప్రజాశక్తి - విజయవాడ సిటీ :** కొండ ప్రాంత ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు నగరపాలక సంస్థ అధికారులను కోరారు. పశ్చిమ నియోజకవర్గం సితార సెంటర్ రామరాజ్య నగర్ ప్రాంతంలో శుక్రవారం కురిసిన వర్షానికి రిటైనింగ్ వాల్ కూలి పలుకు ఇళ్లు దెబ్బ తిన్నాయని ఆయన పేర్కొన్నారు. శనివారం రామరాజ్యం నగర్ కొండ ప్రాంతంలో సిపిఎం నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ క్రమంలో రిటైనింగ్ వాల్ కూలి దెబ్బతిన్న బాధిత కుటుంబాలను పరామర్శించారు. గుర్రం అప్పారావు, మల్లంపాటి బాబూరావు, అల్లూరమ్మ ఇల్లు దెబ్బ తిన్నాయని ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి బాధితులకు నష్టపరిహారం చెల్లించి ఆ ప్రాంతంలో తిరిగి రిటైనింగ్ వాల్ నిర్మాణానికి తగు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాధికారులకు సిపిఎం ఫ్లోర్ బోయి సత్యబాబు విజ్ఞప్తి చేశారు. సిపిఎం నగర కమిటీ సభ్యులు ఎమ్‌డి మస్తాన్, అప్పలరాజు, ఎన్.గురప్ప వెంకటరమణ చంటి తదితరులు బాధితులను పరామర్శించిన వారిలో ఉన్నారు.

## రథం సెంటర్లో ఆక్రమణల తొలగింపు

**ప్రజాశక్తి - విజయవాడ సిటీ :** ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం ఘాట్ రోడ్డు నుంచి అర్జున వీధి, రథం సెంటర్ వరకు రహదారికి ఇరువైపులా ఆక్రమణలకు గురైన సంగతి తెలిసిందే. ఈ ఆక్రమణలతో దుర్గగుడికి విచ్చేసే యాత్రికులతో పాటు గట్టు వెనుక ప్రాంతాల నుంచి పాతబస్తీలోకి ప్రవేశించే నగరవాసులు ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొంటున్నారు. నగరంలోని పలు వర్గాల నుంచి వచ్చిన ఫిర్యాదులతో దుర్గగుడి కార్యనిర్వహణాధికారి వీకే శీనానాయక్ మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులతో క్షేత్రస్థాయిలో ఇటీవల పర్యటించి దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించిన సంగతి తెలిసిందే. శనివారం విజయవాడ ఆర్‌డిఒ కావూరి చైతన్యతో పాటు వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆక్రమణదారులకు ముందస్తు సమాచారం అందజేసి దుకాణాలు తొలగించాలని హెచ్చరికలు జారీ చేశారు. ఇక శనివారం సాయంత్రం దేవస్థాన ఘాట్ రోడ్ నుంచైనా వాల్ అర్జున వీధి రథం సెంటర్ వరకు రహదారులకు ఇరువైపున ఆక్రమణలకు గురైన దుకాణాల తొలగింపునకు చర్యలు చేపట్టారు. తొలగింపు కార్యక్రమంలో విజయవాడ పశ్చిమ ఎసిపి దుర్గారావు 11 సిఐ గురుప్రకాష్ పోలీస్ సిబ్బందితో సహా మున్సిపల్ రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఆక్రమణలతో తొలగింపును అటు ప్రయాణికులతో పాటు నగరవాసులు స్వాగతిస్తున్నారు.



# త్వరగా స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణ పనులు

### విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర



**ప్రజాశక్తి - విజయవాడ :** వర్షాకాలంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, వర్షపునీరు రోడ్డు మీద నిలవకుండా స్ట్రామ్ వాటర్ డ్రెయిన్స్‌ను త్వరితగతిన ప్రారంభించాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. కే.ఎల్ రావు హెడ్ వాటర్ వర్క్స్, పంజా సెంటర్, పాయికాపురం చెరువు, అజిత్ సింగ్ నగర్, ఐకానిక్ పార్క్, ఎక్సెల్ ప్లాంట్, సింగ్ నగర్ అన్న క్యాంటీన్, దావబుచ్చయ్య కాలనీ, రాజగోపాల్ చారి వెజిటబుల్ మార్కెట్ ప్రాంతాలను శనివారం పర్యటించిన కమిషనర్ క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అమృత్ 2.0 లో భాగంగా జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేసే ప్రజలకు సత్వరము త్రాగునీరు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. పంజా సెంటర్లో నిర్మించబోతున్న వర్షపు నీటి డ్రైన్ పరిశీలించి త్వరితగతిన పనులను మొదలుపెట్టి నగరంలోని వర్షపు నీటి నిల్వల సమస్యలను సత్వరమే దూరం చేసేందుకు చర్యలు తీసుకునేలా అధికారులు పనులు చేయాలని ఆదేశించారు. నగరంలో ప్రజలకు అవసరమైన చోటల్లా రోడ్లను నిర్మించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని పాయకాపురం చెరువు వద్ద నిర్మిస్తున్న రోడ్డును పరిశీలించి కమిషనర్ అన్నారు. అనంతరం అజిత్ నగర్ వద్ద గల ఐకానిక్ పార్క్ ను పరిశీలించి, పార్క్ లో చేపట్టాల్సిన అభివద్ధి పనులను త్రుతగతిన మొదలుపెట్టి, ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ను పరిశీలించి, అక్కడున్న చెత్తను ఎప్పటికప్పుడు జిందాల్కి తరలించిన అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. సింగనగర్ అన్న క్యాంటీన్ ను పరిశీలించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా త్రాగునీటి సరఫరా వాడుక నీటి సరఫరా పారిశుధ్య నిర్వహణ ఆహారంలో నాణ్యత పని వేళలో సమయపాలన కచ్చితంగా జరిగేలా ప్రతి ఒక్క నూడల్ ఆఫీసర్లు తమ తమ అన్న క్యాంటీన్ ను పరిశీలించేటప్పుడు చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, ఇన్చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకష్ణ నాయక్, పర్యవేక్షణ ఇంజనీర్లు పి. సత్యకుమారి, పి. సత్యనారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్(యు సి డి) పి. వెంకటనారాయణ, ఎస్టేట్ ఆఫీసర్ ఎ.శ్రీధర్, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ ఎస్ వి కే చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జె. శ్రీనివాస్, సురేఖ, సామ్రాజ్యం, ఇంచార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చంద్రశేఖర్, ఏసు పాదం తదితరులు పాల్గొన్నారు.



## పర్యావరణ హిత మార్గాలు.. నవ్య పరిశ్రమలకు సోపానాలు

### కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

**ప్రజాశక్తి - విజయవాడ :** ప్రపంచానికి ప్లాస్టిక్ కాలుష్యం పెను సవాలుగా మారిన ప్రస్తుత పరిస్థితిలో ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ ఉత్పత్తుల తయారీతో ముఖ్యంగా యువత, మహిళలు కొత్త పారిశ్రామిక యూనిట్లను ఏర్పాటు చేయడం ద్వారా, పారిశ్రామికవేత్తలుగా ఎదగొచ్చని, ఈ విషయంపై సమన్వయ శాఖలు అవగాహన కల్పించడంతోపాటు ప్రోత్సహించాలని కలెక్టర్‌జి.లక్ష్మీశ సూచించారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఇగ్నైట్ స్టాళ్లను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. ప్లాస్టిక్ ఇయర్‌బడ్స్, క్యాండీ స్టిక్స్, పాలీస్టరిన్ (థర్మోకోల్) వస్తువులు వంటి నిషేధిత ప్రత్నామ్నాయంగా ఉత్పత్తులను పరిశీలించారు. జిల్లా ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

# 4 నుండి యువ పారిశ్రామిక వేత్తల సదస్సు

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** యువ పారిశ్రామిక వేత్తలను తీర్చిదిద్దడంతో పాటు వ్యాపార రంగంలో అభివృద్ధిపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో 'బిటో ఎక్స్ పో -2025' పేరుతో బిజినెస్ బై బ్రాహ్మణ ట్రస్టు ఆధ్వర్యంలో జూలై 4,5,6 తేదీల్లో గాంధీనగర్‌లోని ఫిలిం ఛాంబర్ హాల్‌లో జరుగుతుందని బిజినెస్ బై బ్రాహ్మిణ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షుడు బుర్రా ఫణిచంద్ర, జాతీయ కార్యదర్శి పరిమి గిరిబాబు తెలిపారు. లబ్బీపేటలోని ఓ హోటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుర్రా ఫణిచంద్ర, పరిమి గిరిబాబు మాట్లాడుతూ, మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, వివిధ ప్రముఖ కంపెనీలు వారి వ్యాపార అభివృద్ధిపై ప్రదర్శనలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వివిధ అంశాలపై యువ పారిశ్రామిక వేత్తలకు తెలియజేస్తారని ముఖ్యంగా బ్రాహ్మణ వ్యాపారస్తులు ఇటీవల కాలంలో పలు కంపెనీల ద్వారా జరిగిన అభివృద్ధి గురించి వివరిస్తారని పేర్కొన్నారు. మూడు రోజుల పాటు జరిగే బిజినెస్ ప్రదర్శన ఉదయం 10 నుండి సాయంత్రం 7 గంటల వరకు జరుగుతుందన్నారు. ఎటువంటి ప్రవేశ రుసుము లేదని ఎవరైనా పాల్గొని కొత్తగా వ్యాపార అభివృద్ధికి తమకు కావాల్సిన సమాచారం వివిధ రంగాల నిపుణుల వద్ద నుండి పొందొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్, సోలార్, బ్యాంకింగ్, ఫైనాన్స్, క్రెడిట్ సొసైటీ, జెవెల్, జ్యూట్ బ్యాగ్స్, హెల్త్ అండ్ వెల్‌నెస్, రియల్ ఎస్టేట్, బిల్డింగ్ మెటీరియల్, హోమ్ ఆటోమేషన్, కిచెన్ అక్సెసిరీస్, ఇంటీరియర్, ఈ లెర్నింగ్ తదితర సంస్థలకు చెందిన స్టాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు ఆయా రంగాల ప్రముఖులు ప్రసంగిస్తారని చెప్పారు. బ్యాంకింగ్ సంస్థలు నూతన వ్యాపారాభివృద్ధికి సంబంధించి వివిధ బ్యాంకింగ్ సంస్థలు పాల్గొని తక్షణమే లోన్ సదుపాయం కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు జంద్యాల శంకర్, చెరువు రామకోటయ్య, బసవరాజు, శ్రీనివాస్, కుందా రామనారాయణ తదితరులు పాల్గొన్నారు.




పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

## పరిమళించిన స్వరలయ సౌరభం

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** ఉన్నత శ్రేణి సంగీత విద్వాంసులతో నెలవారీ సంగీత సభలు, వర్ధమాన కళాకారులకు పోటీలు నిర్వహించి వారికి వేదికలు కల్పిస్తూ శాస్త్రీయ సంగీత పరిరక్షణ వ్యాప్తికి సేవలందిస్తున్న శ్రీసుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి ఇటీవల నిర్వహించిన సంగీత పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం జరిగింది. స్టార్ హాస్పిటల్స్ హైదరాబాద్ వారి సౌజన్యంతో విజేతలు వారి వారి కృషిని ప్రదర్శన ద్వారా చాటారు. భాను నగర్‌లోని శ్రీ సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి కార్యాలయంలో శనివారం ఈ ప్రదర్శన జరిగింది. విజయపురపు శ్రీ వర్షిణి, వి.ఎస్.జగన్నాథరావు, తంగిరాల మైథిలి, తనికెళ్ల హరిణిల గాత్ర సంగీత కచేరీలు, ఏ ధృవ, తంగిరాల మైథిలిల వయోలిన్ వాద్య కచేరీలు, అంబటిపూడి శివప్రియ, వీరుభొట్ల లిఖితల వీణ వాయిద్య కచేరీలు, యేల్లెపెద్ది దీక్షిత్ మురారి వేణువాద్య కచేరి, చిలకపాటి సువర్ణ, కొమ్మనాపల్లి జ్యోత్స్న, తటుకు సాయిబాబా, వి శ్యామకష్ణ ల మదంగ వాదనం సభలలో అభినందనలందుకున్నారు. పర్యవేక్షణ సమితి కార్యదర్శి, వైస్ చైర్మన్‌లు సివి రావు, రామలక్ష్మి చేయగా ముఖ్యఅతిథిగా ఎపి జెంకో ఎండి కెవిఎన్ చక్రధరబాబు (ఐఎఎస్), గాత్ర సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్‌లు విచ్చేసి విజేతలకు బహుమతి ప్రదానం చేసి మాట్లాడారు. సంగీతం మానసిక వికాసం కలిగిస్తుందని, భారతీయ సంగీతానికి ఆసక్తి ఉందని అన్నారు. బాల్యం నుంచే సంగీత సాహిత్యాల పట్ల అవగాహన కలిగిస్తూ పిల్లల్ని పెంచాలని కోరారు.

# కేన్సర్ నివారణకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం: ఎంఎల్ఎ బొండా

**ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ :** హెచ్‌సిజి కేన్సర్ హాస్పిటల్‌లో కేన్సర్ నిర్ధారణ, నివారణకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం ఎంఎల్ఎ బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. గుణదలలోని హెచ్‌సిజి కేన్సర్ హాస్పిటల్‌లో అధునాతన 'పాజిట్రాన్ ఎమిషన్ టోమోగ్రఫీ, కంప్యూటెడ్ టోమోగ్రఫీ స్కానింగ్ మెషిన్' (సీమెన్స్ బయోగ్రాఫ్ పెట్-సిటీ స్కాన్) యంత్రాన్ని ఎమ్మెల్యే బొండా ఉమామహశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై శనివారం ఉదయం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీని అందిపుచ్చుకొని కేన్సర్‌ను ముందుగానే గుర్తించే అత్యాధునిక సీమెన్స్ బయోగ్రాఫ్ పెట్- సిటీ స్కాన్ యంత్రాన్ని హెచ్.సి.జి. క్యాన్సర్ హాస్పిటల్‌లో అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయం అన్నారు. పభుత్వ పరంగా డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా 140 రకాల వ్యాధులకు ఉచితంగా సేవలందిస్తున్నట్లు తెలిపారు. హెచ్.సి.జి. కేన్సర్ హాస్పిటల్ హాస్పిటల్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ గోపీచంద్ మాట్లాడుతూ, ఈ అధునాతనన పెట్ స్కాన్ యంత్రం ద్వారా క్యాన్సర్ కణాలు, కణితులు శరీరంలో ఎక్కడున్నా సులభంగా గుర్తించొచ్చని తెలిపారు. తద్వారా వ్యాధిని మొదటి దశలోనే పసిగట్టి జబ్బుని అతి సులభంగా నియంత్రించొచ్చని, చికిత్స మధ్యలో జబ్బు తగ్గిందో లేదో తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హెచ్.సి.జి. కేన్సర్ హాస్పిటల్‌లో చికిత్స పొంది క్యాన్సర్ మహమ్మారి నుండి బయటపడిన పలువురికి ఆసుపత్రి తరఫున ఎమ్మెల్యే సత్కరించారు. హాస్పిటల్ ముఖ్య కార్యనిర్వహణాధికారి యువకిశోర్ తెర్లి మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద వైద్య సేవలు, అన్ని రకాల కాష్‌లెస్ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.




సిటీ స్కాన్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఏ బొండా